# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 303 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 8 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 303 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 8 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి

- మిగతా 2లో

- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును డిస్మిస్ చేయాలి



- తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్
- బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు

- మిగతా 2లో



# అసెంబ్లీలో బ్లాక్ వార్!



**బ్లాక్ టీషర్ట్‌లతో వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు**

- తీవ్ర వాగ్వాదం.. తోపులాట.. కేటీఆర్, జగదీశ్ రెడ్డికి గాయాలు
- టీషర్ట్ విప్పి బనియన్‌తో హరీశ్ రావు నిరసన
- కేటీఆర్, హరీశ్ సహా పలువురు అరెస్టు
- 'రాహుల్ బ్లాక్ డ్రెస్ వేసుకుంటే ఒప్పు.. మేం వేసుకుంటే తప్పా?': తలసాని

తెలంగాణ అసెంబ్లీ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం కాస్తా తోపులాటకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు.

### మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ

వివరాలు 2లో..

### 'నా చీర లాగేశారు'.. అసెంబ్లీ గేటు వద్ద సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు

### మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్



## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

**బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం**

- గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన
- వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం
- 45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు
- ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు

- మిగతా 7లో



## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

**దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది వారే: లోక్‌సభ స్పీకర్**

- భారత చరిత్రలో మహిళలే అసలైన మార్పునకు మార్గదర్శకులన్న ఓం బిర్లా
- స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు మహిళల పాత్ర కీలకమని వెల్లడి
- నేటి మహిళలు అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్నారని వ్యాఖ్య
- మహిళా శాసనసభ్యుల కోసం జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేక వర్క్‌షాప్


- మిగతా 7లో

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..

**పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

- అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు
- బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలని డీజీపీకి సూచన

2లో



## స్పీకర్‌పై ఘోరమైన భాష.. కేసీఆర్ స్పందించాలి



హైదరాబాద్ పెన్ పవర్: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదన్నారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ఉందన్నారు. కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయన్నారు.

- మిగతా 2లో



తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్

## కంటతడి

- అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

- మిగతా 2లో

## నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..

**నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది**

- అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు
- స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య
- తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు

- మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్:అసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద



## ఉద్యోగాల పేరుతో మోసం

**ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్**



- శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్
- లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

- మిగతా 2లో

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

- ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పత్‌లో పికప్ వాహనం బోల్తా
- ప్రమాదంలో 12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు
- రాజస్థాన్ నుంచి బదౌన్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన
- డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- మృతుల కుటుంబాల కోసం పోలీసులు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

- మిగతా 2లో





## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### స్పీకర్‌పై ఘోరమైన భాష.. కేసీఆర్ స్పందించాలి

- మొదటి పేజి తరువాయి

పార్టీ నేతలతో కలిసి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు.

**పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది..**

"సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారు. ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడం మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది. పోలీసు సిబ్బంది గొంతు నొక్కుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలి. బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉంది. అసెంబ్లీలోకి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ (దీ=వా) ప్రభుత్వమే రూల్స్ రూపొందించింది. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదనే నిబంధన ఉంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ(=ఖష్ట్రబశ్రీ +ఖఅసష్ట్రఱ) ఒక న్యాయం, మాకో న్యాయమా అని కేటీఆర్ (ఖ=) అంటున్నారు. రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకుని లోక్‌సభకు వెళ్లలేదు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయి. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే మేము తీసుకెళ్లలేదు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారు. ఏవైనా లోటుపాట్లు జరిగితే మా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది.

**ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు**

తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలి. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదు. స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం?. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంది. తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారు. శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారు. మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపింది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే. ఆ తర్వాతే మిగతా కార్యకలాపాలు ఉంటాయి. అసెంబ్లీ ప్రాంగణానికి సంబంధించి పూర్తిస్థాయి అధికారం స్పీకర్, ఛైర్మన్‌కే ఉంటుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు.. పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

- మొదటి పేజి తరువాయి

ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీ వ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యకు_లు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

- మొదటి పేజి తరువాయి


ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

# అసెంబ్లీలో బ్లాక్ వార్!









- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బ్లాక్ డ్రెస్‌లో అసెంబ్లీకి వచ్చారు. అయితే నల్ల దుస్తులతో లోపలికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి సహా పలువురు నేతలు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలకు గాయాలైనట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, వివేకానందరెడ్డి సహా పలువురు నేతలు టీషర్టులు విప్పేసి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పా? అని నిలదీశారు. ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించకుండా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టీషర్టులు ధరించడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరిస్తే తప్పు లేనప్పుడు తమకు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారని నిలదీశారు. పిల్లలకు ఉద్యోగాలు అడిగితే విద్యార్థులపై పోలీసులు దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఇదేం పాలన? అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. తాజా పరిణామాలతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### 'నా చీర లాగేశారు'.. అసెంబ్లీ గేటు వద్ద సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్ల చీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న మహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్లు ఏం రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు. తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డికి గాయాలైనట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

### మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వ్యవహరించిన తీరును రాష్ట్రం మొత్తం చూసిందన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.



**స్పీకర్‌పై అవిశ్వాసం.. ఆలోచిస్తాం**

"మేం నిలదీస్తామని తెలిసే.. మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం. హోంమంత్రిగానూ ఉన్న రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టం.. జాతీయ మహిళా కమిషన్ దగ్గరకూ వెళ్తాం. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయి.. అసెంబ్లీని నెలరోజులు నిర్వహించాలి. సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వను అనడమేంటి? స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై ఆలోచిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

### మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు



తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగు పెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు.

కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## నేను స్పీకర్‌ను, ఛైర్మన్‌ను దూషించలేదు..
## నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది

- మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును డిస్మిస్ చేయాలి: సీఎం రేవంత్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

## ఉద్యోగాల పేరుతో మోసం: ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.


టౌన్‌ప్లానింగ్ సౌజన్యంతో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తి..

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

● నిబంధనలు ఉల్లంఘించిన ప్రమాదకర అక్రమ నిర్మాణాలతో రిస్కులో ప్రజలు..
● గండిమైసమ్మలో పక్కా అక్రమ కట్టడాలపై చర్యలేవి ఏసిపి-టిపిఎస్..?
● డిప్యూటీ కమిషనర్ మౌనానికి అర్థం..? సంపూర్ణ సహకారమా..?
● అక్రమ నిర్మాణాల వ్యవహారంలో చక్రం తిప్పుతున్న నామినేటెడ్ నేతపై విమర్శలు..?
● బయటి వారి అక్రమ నిర్మాణాలకు సెటిల్మెంట్‌లు..? బంధువుల పేరిట భద్రత..?
● సిఫార్సులకు చట్టబద్దత లేదని అధికారుల కైనా కొంచెం అవగాహన ఉండాలి కదా..?


# ముడుపులు ముట్టాయా..? అందుకే చర్యలు ఆగాయా..?

## జస్ట్ ఆస్కింగ్..!

● నిరంజన్ కాలనీలో రెండు రెసిడెన్షియల్ అనుమతులతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..!
● ఈ నిరంజన్ కాలనీలోని అక్రమ కాంప్లెక్స్‌కు ఓ ఇద్దరు నాయకుల సిఫార్సులట..?
● ఒకరు నామినేటెడ్, మరొకరు మాజీ.. ఈ ఇద్దరి సిఫార్సులే ఈ సర్కిల్‌లో కీలకమా..?
● నర్సాపూర్ హైవేకు పిస్తాహౌస్ సమీపం లోనూ అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు..
● బోనస్‌గా జీరో సెట్‌బ్యాకులతో, పక్కింటికి అంటుకుని ప్రమాదకరంగా నిర్మాణం..
● భారీగా ముడుపులు ముట్టాయా..? చర్యల జాప్యం దేనికి..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం..?
● పోలీస్ స్టేషన్ సమీపంలోనూ 2 పర్మిషన్ లతో ఒకటే భవన నిర్మాణం, అక్రమ సెల్లార్..
● పక్కనే భారీ అక్రమ షెడ్డుపై చర్యలేవి..? ముడుపుల స్వీకరణ నిజమేనా..?
● గండిమైసమ్మ చౌరస్తాలో గచ్చిబౌలి ఘటన తరహా మరో 2 ప్రమాదకర అక్రమ కట్టడాలు..
● అలంకార ప్రాయంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్..? మౌనం వీడాలి..!

వివరాలు 4లో..


నిరంజన్ కాలనీలోని అక్రమ నిర్మాణానికి చకచకా రంగులు.. రంగులేస్తే రైటై పోతుందా..?


నిరంజన్ కాలనీలో రెండు రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..



# అసెంబ్లీ గేటు వద్దే..! ఎమ్మెల్యేలు, ఎమెల్సీ అరెస్ట్..!

బీఆర్ఎస్ నేతల అరెస్టుపై కుత్బుల్లాపూర్ లో భగ్గుమన్న నిరసనలు..

● అసెంబ్లీ సమీపంలో గులాబీ నేతల అరెస్టుపై నిరసన జ్వాలలు..
● కేటీఆర్, హరీశ్‌రావు, రాజు, వివేకానంద అరెస్టును ఖండించిన బీఆర్ఎస్ శ్రేణులు..
● కొంపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం..
● ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్..
● డీసీ లావణ్యకు వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ నాయకులు..
● శంబీపూర్ రాజు, కేపీ వివేకానంద్ గౌడ్ ఆదేశాలతో ఆందోళన: వారాల వినోద్..
● హామీలు అమలు చేయాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి..

-6లో

# ప్రతి నోటీసును అందించాల్సిందే



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో జారీచేసిన ప్రతి నోటీసును ఓటర్లకు అందించాల్సిందేనని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవోలు), ఎన్నికల నమోదు అధికారు(ఈఆర్వో)లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఈవో సమీక్ష నిర్వహించారు. "ఓటరు చిరునామాలో నోటీసులు అందించే విధంగా బీఎల్‌ఏల సహాయాన్ని బీఎల్‌వోలు తీసుకోవాలి. జిల్లాలకు అందించిన అదనపు లాగిన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని, పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పరిష్కరించాలి. అనామలీస్, అన్-మ్యాపింగ్ నోటీసుల జాబితాలపై రాజకీయ పార్టీలతో చర్చించాలి. గుర్తింపు పత్రాలను అప్‌లోడ్ చేయడంలో కంప్యూటర్ ఆపరేటర్లు తప్పులు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగుల

-7లో

# అనుమతులు అతిక్రమిస్తే..! చర్యలు తప్పవు..!


మల్లంపేట్‌లో టౌన్‌ప్లానింగ్ గుర్తించిన అక్రమ నిర్మాణం..

● దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హెచ్చరిక..
● దుండిగల్ సర్కిల్ మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణంపై స్లాబ్‌లకు రంధ్రాలు..

● శనివారం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మార్వాడి అక్రమ నిర్మాణంపై చర్యలు..
● ఒక అదనపు అంతస్తును నిర్మించారని, సోమవారం కూల్చివేతలు..
● మల్లంపేట్‌పైనే చర్యలకు ప్రత్యేక దృష్టి సారిస్తున్న దుండిగల్ టౌన్‌ప్లానింగ్..
● గండిమైసమ్మ, బహుదూర్‌పల్లిలో అక్రమ నిర్మాణాలపై చర్యలేవి..? అంటూ ప్రశ్నలు..

-5లో

టౌన్‌ప్లానింగ్ సౌజన్యంతో భారీ అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తి..



నిరంజన్ కాలనీలో రెండు రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..



# ముడుపులు ముట్టాయా..? అందుకే చర్యలు ఆగాయా..?

## జస్ట్ ఆస్కింగ్..!

- నిబంధనలు ఉల్లంఘించిన ప్రమాదకర అక్రమ నిర్మాణాలతో రిస్కులో ప్రజలు..
- గండిమైసమ్మలో పక్కా అక్రమ కట్టడాలపై చర్యలేవి ఏసిపి-టిపిఎస్..?
- డిప్యూటీ కమిషనర్ మౌనానికి అర్థం..? సంపూర్ణ సహకారమా..?
- అక్రమ నిర్మాణాల వ్యవహారంలో చక్రం తిప్పుతున్న నామినేటెడ్ నేతపై విమర్శలు.?
- బయటి వారి అక్రమ నిర్మాణాలకు సెటిల్మెంట్‌లు..? బంధువుల పేరిట భద్రత..?
- సిఫార్సులకు చట్టబద్దత లేదని అధికారుల కైనా కొంచెం అవగాహన ఉండాలి కదా..?



నిరంజన్ కాలనీలోని అక్రమ నిర్మాణానికి చకచకా రంగులు.. రంగులేస్తే రైటై పోతుందా..?

- నిరంజన్ కాలనీలో రెండు రెసిడెన్షియల్ అనుమతులతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..!
- ఈ నిరంజన్ కాలనీలోని అక్రమ కాంప్లెక్స్‌కు ఓ ఇద్దరు నాయకుల సిఫార్సులట..?
- ఒకరు నామినేటెడ్, మరొకరు మాజీ.. ఈ ఇద్దరి సిఫార్సులే ఈ సర్కిల్‌లో కీలకమా..?
- నర్సాపూర్ హైవేకు పిస్తాహౌస్ సమీపం లోనూ అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు..
- బోనస్‌గా జీరో సెట్‌బ్యాకులతో, పక్కింటికి అంటుకుని ప్రమాదకరంగా నిర్మాణం..
- భారీగా ముడుపులు ముట్టాయా..? చర్యల జాప్యం దేనికి..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం..?
- పోలీస్ స్టేషన్ సమీపంలోనూ 2 పర్మిషన్ లతో ఒకటే భవన నిర్మాణం, అక్రమ సెల్లార్..
- పక్కనే భారీ అక్రమ షెడ్డుపై చర్యలేవి..? ముడుపుల స్వీకరణ నిజమేనా..?
- గండిమైసమ్మ చౌరస్తాలో గచ్చిబౌలి ఘటన తరహా మరో 2 ప్రమాదకర అక్రమ కట్టడాలు..
- అలంకార ప్రాయంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్..? మౌనం వీడాలి..!

గచ్చిబౌలి అంజయ్యనగర్ ప్రమాద ఘటనతో, అప్రమత్తమైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్.. వివిధ సిఎంసి సర్కిల్‌లకు, చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.. అయితే చర్యలపై కమిషనర్ ఆదేశాలు అమలవుతున్నాయా..? అబాసుపాలు అవుతున్నాయా..? అన్నది అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.. దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపడుతున్న చర్యల తీరు హాస్యాస్పదంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.. గండిమైసమ్మ, బహుదూర్‌పల్లి, పరిధిలో, అత్యంత ప్రమాదకర (మోస్ట్ డేంజరస్) బహుళ అంతస్తులను కూల్చేయకుండా ఉదాసీనత వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.. కూల్చేసినవి కూడా మళ్ళీ నిర్మించినప్పటికీ, చర్యలు తీసుకోకుండా ప్రోత్సహిస్తున్నారని చర్చించుకుంటున్నారు..! కేవలం సిఎంసి కమిషనర్ నివేదికల కోసమే అన్నట్టు చిన్న చిన్న వాటిపై చర్యలు చేపట్టడం, ఇప్పుడు కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. కమిషనర్ ఆదేశాలకు విరుద్ధంగా, గచ్చిబౌలి ఘటన తరహా అక్రమ నిర్మాణాలతో, ప్రజలను ప్రమాదంలో పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మీకేం కావాలో తీసుకోండి.. మాకు ఎదురు చెప్పవద్దని ఓ ముగ్గురు అధికారుల నడుమ ముడుపుల ఒప్పంద ఒడంబడికలు చేసుకున్నారని అనధికారిక సమాచారం..? ఈ వ్యవహారం అంతా సిఎంసి ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోందా..? సిఫార్సుల మాటున ఈ దందా సాగుతుందా..? అన్న ప్రశ్నలకు తావిస్తోంది.. **సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**

గండిమైసమ్మ చౌరస్తాలో బయట రంగులు లోపల పనులు.. రంగులేస్తే రైటైపోతుందా..?





పియస్ సమీపంలో, రెండు రెసిడెన్షియల్ పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్.. అదనంగా అక్రమ సెల్లార్.



పక్క భవనానికి "ఫెవికాల్"తో అతికించినట్టు 'జీరో' సెట్‌బ్యాకులు..

నర్సాపూర్ హైవేపై రెసిడెన్షియల్ పర్మిషన్‌తో అక్రమ సెల్లార్, అదనంగా రెండు అంతస్తులు..






గండిమైసమ్మ చౌరస్తాలోనే, గచ్చిబౌలి తరహా ఈ పేకమేడపై చర్యలేవి..



టెక్ మహీంద్రా ఎదురుగా, డీసీ, ఏసిపి సమక్షంలో కూల్చేసినది.. ఇలా పూర్తయింది..

నర్సాపూర్ రోడ్డులో తాజా టిక్కెన్స్ పక్కన, చర్యలన్నీ ముగిసాయి.. అయినా కమర్షియల్ కాంప్లెక్స్ సిద్ధం..




దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలోని వివిధ గ్రామాలలో, టౌన్‌ప్లానింగ్ అధికారులు చేపడుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు ఔరా అనిపిస్తుంది..ఈ చర్యల తీరు అక్రమార్కులకు అనుకూలంగా, వెంటనే నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. పిచ్చుకపైన బ్రహ్మాస్త్రంలా వెతికి వెతికి మరీ చిన్న చిన్న నిర్మాణాలను కూల్చివేతలకు ఎంచుకోవడం అనుమానాలను రేకెత్తిస్తుందని అంటున్నారు.. దుండిగల్ కార్యాలయం చుట్టూ, 100 శాతం నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ నిర్మాణాలు వదిలేసి.. అదనంగా ఒక అంతస్తు, రెండు అంతస్తులు ఉన్నవి గుర్తించిన అధికారులు.. రోజుకో నిర్మాణంపై స్లాబ్‌లకు రంధ్రాలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి..మరోవైపు మున్సిపల్ వ్యవస్థలోనే కీలక విభాగమైన, పట్టణ ప్రణాళికలో, సిఎంసిలో విలీనమైనటప్పటికీ ఔట్ సోర్సింగ్ సిబ్బందినే చైన్‌మెన్‌లుగా నియమించు కోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. చివరికి, పట్టణ ప్రణాళికా విభాగంలోనూ కంప్యూటర్ ఆపరేటర్, కోర్టువ్యవహారాలు చూసుకోవడానికి కూడా, ఈ ఔట్ సోర్సింగ్ సిబ్బందే కీలకంగా వ్యవహరించడం ప్రశ్నలు లేవనెత్తుతోంది.. పర్మిషన్‌లు ఇవ్వకూడని ప్లాట్‌లకు, ఇండస్ట్రియల్ జోన్‌లో, కన్జర్వేషన్ జోన్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తున్నారని, ఆరోపణలు ఉండగా.. ప్రభుత్వ భూముల్లోనూ తప్పుడు పర్మిషన్‌లు మంజూరు చేసినట్టు తెలుస్తోంది.. మరోవైపు ఈ అక్రమ కట్టడాల సెటిల్మెంట్‌ల వ్యవహారంలోను, కొందరు చేయితిరిగిన చైన్‌మెన్‌లు ఉన్నట్టు ఆరోపిస్తున్నారు.. ప్రస్తుతం చర్యలు చేపట్టని అక్రమ నిర్మాణాలు కూడా, ముడుపుల నిర్మాణాలేనా అంటూ ప్రశ్నిస్తున్నారు..

# అనుమతులు అతిక్రమిస్తే..!
# చర్యలు తప్పవు..!



మల్లంపేట్‌లో టౌన్‌ప్లానింగ్ గుర్తించిన అక్రమ నిర్మాణం..

- దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హెచ్చరిక..
- దుండిగల్ సర్కిల్ మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణంపై స్లాబ్‌లకు రంధ్రాలు..

- శనివారం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మార్వాడి అక్రమ నిర్మాణంపై చర్యలు..
- ఒక అదనపు అంతస్తును నిర్మించారని, సోమవారం కూల్చివేతలు..
- మల్లంపేట్‌పైనే చర్యలకు ప్రత్యేక దృష్టి సారిస్తున్న దుండిగల్ టౌన్‌ప్లానింగ్..
- గండిమైసమ్మ, బహుదూర్‌పల్లిలో అక్రమ నిర్మాణాలపై చర్యలేవి..? అంటూ ప్రశ్నలు..




అదనపు అంతస్తుపైన బ్రేకర్‌తో రంధ్రాలు..

- స్టిల్ట్ ప్లస్ 2 అనుమతితో.. స్టిల్ట్ ప్లస్ 3 నిర్మాణం..
- మల్లంపేటలో ఈ అక్రమ అదనపు అంతస్తు కూల్చివేత..
- అనధికారిక నిర్మాణాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు డిప్యూటీ కమిషనర్ వెల్లడి..
- అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..
- అక్రమ కట్టడాలపై నిరంతరం కూల్చివేతలు ఉంటాయన్న అసిస్టెంట్ సిటీ ప్లానర్..
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక..!




ఫోటోషూట్ కూల్చివేతలు..

**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అనధికార నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం మల్లంపేటలో అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తుకు బ్రేకర్‌తో రంధ్రాలు చేశారు.. మళ్ళీ నిర్మిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ హెచ్చరించారు.. అధికారుల నుండి వెలువడిన పత్రికా ప్రకటన ప్రకారం.. మల్లంపేట్ ప్లాట్ నెంబర్ 146/పార్ట్, సర్వే నంబర్లు 173, 175, 176, 181 పరిధిలో (స్టిల్ట్ ప్లస్2) అంతస్తులకు అనుమతి పొందినప్పటికీ..! నిబంధనలను ఉల్లంఘిస్తూ అదనంగా (స్టిల్ట్ ప్లస్ 3) ఒక అంతస్తు నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.. దీంతో అనధికారికంగా నిర్మించిన అదనపు అంతస్తును టౌన్ ప్లానింగ్ సిబ్బంది చర్యలు చేపట్టారు.. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ, అనుమతులకు విరుద్ధంగా, నిబంధనలను అతిక్రమించి చేపట్టే ఎలాంటి నిర్మాణాన్నీ ఉపేక్షించబోమని హెచ్చరించారు..

## టౌన్‌ప్లానింగ్ సంచలన హెచ్చరిక..

దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణంలో అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పర్మిషన్ ఒకరకంగా.. నిర్మాణం మరోరకంగా నిర్మించినా..! అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.. అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి చట్టపరంగా డిమాలిషన్ చర్యలు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు.. ఈ కూల్చివేత కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొని చర్యలను పర్యవేక్షించారు

# కారులో వ్యక్తి సజీవ దహనం..

## ఆత్మహత్యగా అనుమానం.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభం..



కారులో సజీవ దహనం అయినట్టు బావిస్తున్న మృతుడి.. (ఫైల్‌ఫొటో)





పూర్తిగా కాలిపోయిన కారు..

**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** బోరంపేటలో రుద్ర కన్‌స్ట్రక్షన్ సమీపంలోని ఖాళీ స్థలంలో, సోమవారం ఉదయం కారులో ఓ వ్యక్తి మంటల్లో చిక్కుకుని మృతి చెందిన ఘటన కలకలం రేపింది... ఉదయం సుమారు 7 గంటల సమయంలో కారు మంటల్లో కాలిపోతున్నట్లు సమాచారం అందడంతో దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు.. మృతుడిని కార్తీక్ (40), తండ్రి రాధాకృష్ణ, బోరంపేటలోని ప్రణీత్ ప్రణవ్ విడోస్‌లో నివాసం ఉంటున్న వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఆయన లాండ్రీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. కార్తీక్‌కు కొంతకాలంగా ఆరోగ్యపరమైన, ఆర్థికపరమైన సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.. అలాగే ఆయన భార్య గత రెండున్నర సంవత్సరాలుగా దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఈ కారణాలతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.. ఘటనపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది..



మంటల్లో కాలుతున్న కారులో సజీవదహనం అవుతున్నది పరిశీలిస్తున్న పోలీసులు..



కొంపల్లి సర్కిల్ ముందు సీఎం దిష్టి బొమ్మ దహనానికి సిద్ధం చేస్తున్న.. వారాల వినోద్..


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు..

# అసెంబ్లీ గేటు వద్దే..!




# ఎమ్మెల్యేలు, ఎమెల్సీ అరెస్ట్..!

## -బీఆర్ఎస్ నేతల అరెస్టుపై కుత్బుల్లాపూర్ లో భగ్గుమన్న నిరసనలు..

- అసెంబ్లీ సమీపంలో గులాబీ నేతల అరెస్టుపై నిరసన జ్వాలలు..
- కేటీఆర్, హరీశ్‌రావు, రాజు, వివేకానంద అరెస్టును ఖండించిన బీఆర్ఎస్ శ్రేణులు..
- కొంపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం..
- ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్..
- డీసీ లావణ్యకు వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ నాయకులు..
- శంబీపూర్ రాజు, కేపీ వివేకానంద్ గౌడ్ ఆదేశాలతో ఆందోళన: వారాల వినోద్..
- హామీలు అమలు చేయాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** అసెంబ్లీ సమీపంలో బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.. మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం కొంపల్లి సర్కిల్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు..అసెంబ్లీ సమీపంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, పలువురు నేతలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం సరికాదని, ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని వారు ఆరోపించారు..

### ఎనిమిది రోజుల నిరసనలో భాగంగా..

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ..! బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ ఆందోళన నిర్వహించారు.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కొంపల్లి సర్కిల్-56 డిప్యూటీ కమిషనర్ లావణ్యకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు..


కొంపల్లి డిప్యూటీ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న వారాల వినోద్..

ప్రజల సమస్యలపై ప్రశ్నిద్దాం.. ప్రజల హక్కుల కోసం పోరాడుదాం.. ప్రజల గొంతుకగా మరో అడుగు ముందుకు వేద్దాం.. అంటూ వారాల వినోద్ కుమార్ తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ముక్త కంఠంతో నినాదాలు చేశారు.. నాడు తెలంగాణ స్వ రాష్ట్ర సాధన కోసం, ఏళ్ళతరబడి ఉద్యమం చేసినోళ్ళం.. ప్రజల హామీలు, హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గులాబీ సైన్యం హెచ్చరించింది..




ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలపై కేబుల్‌లు..

# సమస్యల సుడిగుండంలో..!

# సూరారం ఆర్‌జికే..!

## పరిష్కారం కోసం ప్రజల పోరుబాట.. అండగా బీఆర్ఎస్ నేతల పాదయాత్ర..

- ఆర్‌జీకే '1--14 బ్లాక్' వరకు మౌలిక వసతుల లేమితో,ప్రజలకు అవస్థలు..
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు..
- అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు.. ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన..
- ఎమ్మెల్యే కే.పీ వివేకానంద్ గౌడ్ దృష్టికి సమస్యలు..
- ప్రజావాణిలో డీసి లావణ్య, విరాట్‌కు వినతిపత్రం అందజేత..
- వారాల వినోద్ ఆధ్వర్యంలో పాదయాత్ర..


సూరారం కాలనీ ఆర్‌జికేలో సమస్యలపై వారాల వినోద్ కుమార్ స్థానికులతో పాదయాత్ర..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 292 డివిజన్ సాయిబాబా నగర్ పరిధిలోని సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలోని '1 నుంచి 14 బ్లాక్‌ల వరకు నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరారు.. ఈ సమస్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం, ఇతర మౌలిక సదుపాయాల కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పాదయాత్రలో గుర్తించారు.. ముఖ్యంగా మహిళలు, బస్తీవాసులు తమకు ఎదురవుతున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.. ఆర్‌జికే సమస్యలను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పి వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లినట్లు వినోద్ తెలిపారు.. దీంతో స్పందించిన సమస్యలను పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్ తెలిపారు..




సమస్యలు వివరిస్తున్న స్థానికుడు..

### ఆర్‌జికే సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు..

కాగా కొంపల్లి సర్కిల్ -56లో సోమవారం నిర్వహించిన, ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై డిప్యూటీ కమిషనర్ లావణ్య, విరాట్‌లకు వినతి పత్రం అందజేశారు. సూరారం కాలనీ ఆర్‌జికే బ్లాక్ నెం. 1--14 వరకు వివిధ ప్రాంతాలలో, నెలకొన్న సమస్యలను అధికారులకు వివరించారు.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ వైర్లు, మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.. ఈ సందర్భంగా బస్తీవాసులు, మహిళలు తమ సమస్యలను అధికారులకు స్వయంగా వివరించారు. సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, తారా సింగ్, గట్టు అశోక్, భాస్కర్, రాజు యాదవ్, రంగప్ప, బద్రి, వేణు ముదిరాజ్, సత్యనారాయణ గౌడ్, పూర్ణచందర్ రెడ్డి, కిషోర్ ముదిరాజ్, నరసింహ గౌడ్, జై సింహ రెడ్డి, మునీర్, జహీర్, క్రైసర్ పాషా, మజీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలని ఖండించిన మంత్రి పొంగిలేటి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని.. అది శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు ప్రజాప్రతినిధులు దూరంగా ఉండాలని సూచించారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

# దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం: ఏపూరి తరుణ్

### తాతా మధు వ్యాఖ్యలపై ఖండన



**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను దళిత సమాజం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్ ఏపూరి తరుణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో దళితులు గణనీయమైన శాతం ఉన్నారని, దళిత సమాజాన్ని కించపరిచేలా మాట్లాడటం సరికాదని అన్నారు. దళిత ప్రజాప్రతినిధుల ఓట్లతో ఎమ్మెల్సీగా ఎన్నికైన తాతా మధు అదే సమాజాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. దళిత స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని పేర్కొన్నారు. దళిత నాయకుడిని, దళిత సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ రాజకీయ సంస్కృతిలో భాగమా అని ప్రశ్నించారు. ఇటువంటి వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా ఉన్నాయని అన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వ్యాఖ్యలపై పోలీసులు కూడా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్..

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు.కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్‌షాప్‌లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు.ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రతి నోటీసును అందించాల్సిందే

- 3 పేజి తరువాయి

నివాసాలకు నేరుగా సూపర్‌వైజర్లు వెళ్లి గుర్తింపు పత్రాలను పరిశీలన చేయాలి. డీఈవో, ఈఆర్వో స్థాయిల్లో సహాయ కేంద్రాలు అందుబాటులో ఉండాలి" అని సుదర్శన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నోటీసులు అందుకునే 93 లక్షల మంది ఓటర్ల వివరాలను ఇవ్వాలని సీఈవో సుదర్శన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ పులిపాటి రాజేశ్ కుమార్ సోమవారం విజ్ఞప్తి చేశారు. కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, ఏపీతోపాటు పలు రాష్ట్రాల్లో ఈ జాబితాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతున్నారని, తెలంగాణలోనూ అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ సందర్భంగా రెండు, మూడు రోజుల్లో జాబితాను సీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఎన్నికల అధికారులు హామీ ఇచ్చారు.

# గిరిజన ఆదివాసీ హక్కులను కాపాడాలి

## గిరిజన వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలి

**హైదరాబాద్, పెన్ పవర్, సెప్టెంబర్ 7:**గిరిజన ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని, గిరిజన వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ గిరిజన సంఘం (టి జి ఎస్), ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్ఎం) ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు యం. గోపి నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజనులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటి పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గిరిజనుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఢిల్లీ నడిబొడ్డున మహాధర్నా నిర్వహించినట్లు తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించాలని, గిరిజనులను వారి సాగుభూముల నుంచి తొలగించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని గోపి నాయక్ డిమాండ్ చేశారు. గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు పోడు సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలని కోరారు. దేశంలో గిరిజన నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడం లేదని ఆయన ఆరోపించారు. గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు వంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనులకు




ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా గిరిజనులను మోసం చేసిందని గోపి నాయక్ విమర్శించారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, తమ హక్కులు సాధించే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మహాధర్నాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన ఆదివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు ఈశ్వర్ నాయక్, నేనావాత్ పార్వతి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ద్రోహి కేటీఆర్ గారూ.. సినిమా డైలాగులు కాదు, తెలంగాణ యువతకు ఉద్యోగాలు కావాలి: ఎంపీ వంశీకృష్ణ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ యువత భవిష్యత్తును రాజకీయాలకు బలి చేయకుండా, వారికి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల విషయంలో జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,500 మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల పాటు కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు తెలంగాణ యువత భవిష్యత్తుపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండేదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు.

"ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? యువత నైపుణ్యాలను పెంచేందుకు ఏం చేశారు? ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?" అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలపై వచ్చిన అవకతవకల ఆరోపణలు విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు."సినిమా డైలాగులు చెప్పడం సులభం. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది డైలాగులు కాదు.. వాస్తవాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు" అని వంశీకృష్ణ అన్నారు.

పదవులు శాశ్వతం కాదని, ప్రజల భవిష్యత్తే శాశ్వతమైన అంశమని ఎంపీ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ అవకాశాలు కల్పించారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు.

"మేము నామినేటెడ్ పదవులతో రాలేదు. ప్రజలు మాకు ఓటు వేసి గెలిపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతతో ప్రజల కోసం పనిచేస్తున్నాం" అని పేర్కొన్నారు.తెలంగాణ యువతను ప్రపంచస్థాయిలో నిలబెట్టడమే తమ లక్ష్యమని వంశీకృష్ణ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు వెళ్లి అంతర్జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు."మీకు నిజంగా ధైర్యం ఉంటే రాజకీయ డైలాగులు చెప్పడం కాకుండా తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే పనులు చేయండి. యువత భవిష్యత్తు కోసం పనిచేయండి. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజల తీర్పే అంతిమ తీర్పు" అని అన్నారు.

తెలంగాణ యువత హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం తాము నిరంతరం పోరాడుతామని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరిన 150 మంది యువకులు..

### గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర..

**హైదరాబాద్ పెన్ పవర్:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డుకు చెందిన సుమారు 150 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మనీష్ అధ్యక్షతన పెద్ద సంఖ్యలో యువత మాజీ ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా,వారికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిరు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జీవన్, రుచిత్,వేణు,కిరణ్, ఆకాశ్, సంపత్, సోహెల్, కారుణ్య, సంతోష్, శ్రీ చరణ్, సాయి కమల్, సాయి తేజ, శేషాంత్, ఆదిత్య, సాయి కిరణ్, రాజక్, శివ, వంశీ, మనోజ్, కార్తికేయ, సన్నీ, వివేక్, రాఖీ, సందీప్, విక్కీ, అనిల్ యారా, సాయి శివ, అనిల్, శ్రీకాంత్, అజయ్, చరణ్, సాయి, హరీష్, రాకేష్, బన్నీ, రేవంత్, సిద్ధు, సంజయ్, నిఖిల్, అన్వేష్, భారత్, సూర్య, జయంత్, హర్ష వర్ధన్, జంగంపెల్లి సాయి, సాయి చరణ్ (బ్యారెక్స్) తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..

యువత భవిష్యత్‌తో పాటు భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకగా బిఆర్ఎస్ పార్టీ నిలుస్తోందని పేర్కొన్నారు.

యువత పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం ప్రజల్లో,ముఖ్యంగా యువతలో బిఆర్ఎస్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,23వ వార్డు యువత తదితరులు పాల్గొన్నారు.

# మజ్లీస్ తో రేవంత్ సంబంధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 7, పెన్ పవర్:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. "రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను" అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది.అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. "నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు" అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని



కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం

స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి

రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్–ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

# పాదయాత్రల కౌంటర్...

**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు. 2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది.ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు.జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

# రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...



**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎంతోమంది అయ్యన్నపాత్రుడు కంటే సీనియర్ నాయకులు ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కి 80 సంవత్సరాలు ఉంటాయి. ఈయన కూడా అయ్యన్నపాత్రుడితో పాటే 1983 నుంచి టిడిపిలో ఉన్నారు. మరో సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు కూడా రాజ్యసభ పదవిని కోరుకుంటున్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. కిమిడి కళా వెంకట్రావు.. బండారు సత్యనారాయణమూర్తి వంటి వారు కూడా టిడిపిలో సీనియర్ నేతలుగా పేరు తెచ్చుకున్నారు. అయ్యన్న తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో 2029 ఎన్నికల్లో చంద్రబాబు వీరికి టికెట్ ఇస్తారా.. లేదా అనేది చూడాల్సి ఉంది.

# కులాల చుట్టే పోలరైజేషన్...

**కాకినాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే కుల సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రభావం మరో రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో రాజకీయ ఆసక్తి పెరగడం ఒకవైపు సానుకూల పరిణామంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక వర్గాల ఆధారంగా వారు విడిపోతున్న తీరు మాత్రం చర్చకు దారితీస్తోంది.గతంలో కులం, రాజకీయాల విషయంలో పెద్దల మధ్య ఎక్కువగా చర్చలు జరిగేవి. యువత మాత్రం వాటికి కొంత దూరంగా ఉండేది. తమ చదువు, ఉద్యోగం, వ్యక్తిగత భవిష్యత్తుపైనే ఎక్కువగా దృష్టి పెట్టేది. కానీ సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. రాజకీయ నాయకుల ప్రసంగాలు, అభిమాన సంఘాల కార్యక్రమాలు, సోషల్ మీడియా పోస్టులు నేరుగా యువతను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో తమకు నచ్చిన పార్టీ లేదా నాయకుడి పట్ల కొందరు యువకులు తీవ్ర అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు.రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. యువత విధానాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరుపై చర్చించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన పరిణామాలే. కానీ రాజకీయ అభిమానం సామాజిక వర్గ గుర్తింపుతో కలిసిపోయినప్పుడు పరిస్థితి మరో విధంగా మారే అవకాశం ఉంటుంది. ఒక నాయకుడిని ఆయన విధానాల కోసం కాకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం రాజకీయ చర్చను సంకుచితం చేస్తుంది.ఇటీవల ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం ఇచ్చింది. బైక్ ర్యాలీలు, భారీ సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. చదువుకునే ప్రదేశాలు, పనిచేసే చోట్ల కూడా ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన వారు సమూహంగా ఏర్పడి వేడుకలు నిర్వహించిన సందర్భాలు కనిపించాయి. సహజమైన అభిమానాన్ని మించి భావోద్వేగం కనిపించడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది.ఒక నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు కాదు. అదే అభిమానం ఇతర పార్టీలను లేదా సామాజిక వర్గాలను తక్కువగా చూడటానికి దారితీయకూడదు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం

చేసిన వారిపై దూషణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం వంటి ధోరణులు యువతలో పెరగడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. వాటిని గౌరవించడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే.ఇక యువత ఒక నిర్దిష్ట సామాజిక వర్గం చుట్టూ రాజకీయంగా సమీకృతమైతే భవిష్యత్ ఎన్నికల్లో దాని ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పార్టీలు కూడా యువత మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే యువతను కులం, ప్రాంతం లేదా వ్యక్తిగత అభిమానాలకు పరిమితం చేయకుండా విధానాలు, అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఆలోచించేలా చేయడం అవసరం. అప్పుడే యువ రాజకీయ చైతన్యం సమాజానికి బలంగా మారుతుంది.

# పవన్ వరుస గైర్హాజర్లు... కారణం ఏమిటీ

**ఒంగోలు, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ –జనసేన –బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి. అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది.

# వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

**తిరుపతి, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులిచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

## స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

**శ్రీకాకుళం సెప్టెంబర్ 7, పెన్ పవర్:** స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.


## వడివడిగా లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లు




**విజయవాడ, సెప్టెంబర్ 7, పెన్ పవర్:** ఏపీ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు.. ఓటర్ల జాబితా.. ఇతర వ్యవహారాలను ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలవేళ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు ఆయన కీలక ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో చాలామందికి పదవులు రాబోతున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయారు. శాశ్వతమైన నిర్మాణాలు.. బలమైన కార్య నిర్వాహక వ్యవస్థ.. కొత్త పదవుల భర్తీ వంటివి చేయలేకపోయారు .జగన్ చేయలేక పోయిన పనిని ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం 13 జెడ్పీలు మాత్రమే ఉన్నాయి. వీటిని 28 చేయాలని ఇటీవల చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు నిర్ణయం మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ పరిపాలన కాలంలో మార్కాపురం.. పోలవరం జిల్లాలకు కూడా కూటమి ప్రభుత్వం జడ్పీలను ఏర్పాటు చేసింది. అంతేకాదు కొత్త జిల్లా పరిషత్తుల నిర్వహణ కోసం ఏకంగా 30 కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తోడు అదనంగా 15 జడ్పీ సీఈవో.. 15 డిప్యూటీ సీఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెప్టెంబర్ 24 తో ప్రస్తుతం కొనసాగుతున్న జెడ్పి పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఇది పూర్తి అయిన వెంటనే 28 కొత్త జడ్పీ ల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 660 మండలాలను కొత్త జిల్లా పరిషత్ పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.జెడ్పిల పనితీరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ముందు చూపుతో ఉన్నారు. వివాదాస్పద.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కాకుండా కొత్త జడ్పీ లకు ప్రస్తుతం ఉన్న పారదర్శకమైన సిబ్బందిని ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. పురపాలక ఎన్నికలు పూర్తి కాకముందే జిల్లా పరిషత్ లకు సంబంధించిన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొత్త జిల్లాలవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రి నిర్ణయంతో పరిష్కారం కాబోతున్నాయి. ఆశావాహుకులకు కొత్తగా పదవులు కూడా దక్కబోతున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారనుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## యూట్యూబర్ నందనను శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు




ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.. ఆమెపై ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ కావడంతో విమానాశ్రయంలో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీనిపై అధికారికంగా పోలీసులు స్పందించాల్సి ఉంది. ఈ పరిణామం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.విమానాశ్రయంలో నందనను గుర్తించిన పోలీసులు, ఆమెపై ఉన్న కేసులు, లుక్‌అవుట్ నోటీసులకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి.. అనంతరం ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించారని తెలిసింది. నందనను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.


**లండన్ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు**

నందన, ఆమె భర్తపై గతంలో పలు ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగాల కోసం ఆశపడ్డ పలువురు బాధితులు ఈ వ్యవహారంపై పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.ఈ ఫిర్యాదుల ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో భాగంగా నందన దంపతుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. వారు విదేశాలకు వెళ్లకుండా ఉండేందుకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

**లుక్‌అవుట్ నోటీసులతో పట్టుబడిన నందన**

ఈ నేపథ్యంలో నందన శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సమయంలో ఆమె వివరాలను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. లుక్‌అవుట్ నోటీసులు అమల్లో ఉండటంతో ఎయిర్ పోర్టు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదైన ప్రాంతానికి సంబంధించిన పోలీసులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు.ప్రస్తుతం నందనను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయి. . ఆమెపై నమోదైన కేసులు, డబ్బుల వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు, బాధితుల ఫిర్యాదులు తదితర అంశాలపై నిజానిజాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది..నందనపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో ఉన్న అంశాలేనని, వాటిపై పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెలుగులోకి రావాల్సి ఉంది. ఈ కేసులో మరెవరైనా ప్రమేయం ఉందా? ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఎలాంటి హామీలు ఇచ్చారు? అనే అంశాలపై కూడా పోలీసులు దృష్టి సారించే అవకాశం ఉంది.నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకోవడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. ఇబ్రహీంపట్నం పోలీసుల తదుపరి విచారణతో ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

## విజయసాయిరెడ్డి బోర్ ప్రెస్మీట్.. పార్టీపై సస్పెన్స్ కంటిన్యూ!



మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి పార్టీ ప్రకటనపై సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. కొత్త పార్టీ పెడుతున్నట్లు ఇప్పటికే విజయసాయిరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. గత నెలలో తిరుమల దర్శనానికి వెళ్లిన ఆయన కొత్త పార్టీపై విజయవాడలో మీడియా సమక్షంలో ప్రకటన చేస్తానని వెల్లడించారు. చెప్పినట్లుగానే సోమవారం విజయవాడలో విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో తాను పార్టీ పెడుతున్న పాత విషయాన్నే చెప్పారు కానీ, ఆ పార్టీ పేరు? జెండా? ఎలా ఉంటాయో మాత్రం చెప్పలేదు. ఇక మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తానని చెబుతూ తన పార్టీ అజెండాగా ఐదు అంశాలు ఉంటాయని వెల్లడించారు.మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ పేరు ఏంటి? ఆయన పార్టీలో ఎవరు చేరుతున్నారు? జెండా ఎలా ఉంటుంది? అన్న విషయాలపై క్లారిటీ వస్తుందని పరిశీలకులు ఎదురుచూశారు. కానీ, సోమవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయసాయిరెడ్డి ఆయా అంశాల జోలికి వెళ్లకపోవడంపై అంతా నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షంపై తన పాత విమర్శలతోనే విజయసాయిరెడ్డి కాలం గడిపేశారని పెదవి విరుస్తున్నారు. విజయసాయిరెడ్డి పార్టీ పేరు ఎలా ఉంటుంది? ఆయన టార్గెట్ ఏంటి? అన్న అంశాలపై స్పష్టత వస్తుందని మీడియా సమావేశం ముందు అంతా ఎదురుచూశారు. కానీ, తన ప్రెస్మీటులో ఎలాంటి సంచలనం లేకుండానే విజయసాయిరెడ్డి ముగించడమే చర్చనీయాంశంగా మారింది.పార్టీ పెడతానంటూ ఇప్పటికే ప్రకటన చేసిన విజయసాయిరెడ్డి.. పార్టీ పేరు ప్రకటనపై తర్జనభర్జన పడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఐదు అంశాల అజెండాపై స్పష్టమైన ప్రకటన చేసిన ఆయన పార్టీ పేరు విషయంలో తన ఆలోచన మాత్రం బయటపెట్టకపోవడం అంతుచిక్కడం లేదని అంటున్నారు. ఇక మిగిలిన పార్టీలు మాదిరిగా కాకుండా, తన పార్టీ తరఫున సీఎం అభ్యర్థిగా తాను ఉండనంటూ విజయసాయిరెడ్డి చెప్పడమే ఈ రోజు ప్రెస్మీటులో విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు.ఇక వైసీపీలో సుదీర్ఘ కాలం పనిచేసిన విజయసాయిరెడ్డి సొంత పార్టీ ప్రకటన తర్వాత ఆయనతో ఎవరు కలవనున్నారు? అనే ప్రశ్న ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఇప్పటివరకు విజయసాయిరెడ్డికి మద్దతుగా ఏ నేత బయటపడలేదు. దీంతో విజయవాడ వేదికగా ఈ సస్పెన్స్ ను ఆయన రివీల్ చేస్తారని ఎదురుచూశారు. కానీ, తనది ప్రస్తుతానికి ఒంటరి పోరాటంగానే విజయసాయిరెడ్డి సంకేతాలిచ్చారని విశ్లేషిస్తున్నారు. పార్టీ పెడుతున్నట్లు ప్రకటించిన విజయసాయిరెడ్డి ఈ విషయంలో ఇప్పటివరకు ఎవరితో చర్చించింది? ఎవరెవరిని సంప్రదించింది మాత్రం చెప్పలేదని అంటున్నారు. దీంతో అసలు విజయసాయిరెడ్డి పార్టీ ప్రకటన ఎప్పుడు ఉంటుంది అనేదే ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.

# ప్రపంచంలోనే అత్యంత సన్నని ఇల్లు.. లోపల సౌకర్యాలు చూస్తే షాకవ్వాల్సిందే!







ఇల్లు అంటే విశాలమైన గదులు.. వంటగది.. బాత్‌రూమ్.. బెడ్‌రూమ్.. కొంత ఖాళీ స్థలం ఉండాలని అనుకుంటాం. కానీ ప్రపంచంలోనే అత్యంత సన్నని ఇల్లు మాత్రం ఈ సాధారణ ఆలోచనలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. పోలాండ్‌లోని వార్సా నగరంలో ఉన్న కెరెట్ హౌస్ ప్రపంచంలోనే అత్యంత ఇరుకైన నివాస నిర్మాణాల్లో ఒకటిగా ప్రత్యేక గుర్తింపు పొందింది. రెండు భవనాల మధ్య ఉన్న చిన్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకుని నిర్మించిన ఈ ఇల్లు.. వాస్తుశిల్పం ఎంత వినూత్నంగా ఉండొచ్చో ప్రపంచానికి చూపించింది.

**రెండు భవనాల మధ్య చిన్న సందులో..**

వార్సాలోని వోలా ప్రాంతంలో రెండు భవనాల మధ్య ఉన్న అత్యంత ఇరుకైన స్థలంలో కెరెట్ హౌస్‌ను నిర్మించారు. పోలిష్ ఆర్కిటెక్ట్ జాకుబ్ స్జెస్నీ ఈ నిర్మాణాన్ని రూపొందించారు. బయట నుంచి చూస్తే ఇది సాధారణ భవనంలా కాకుండా రెండు భవనాల మధ్య ఇరుక్కున్న ఒక సన్నని నిర్మాణంలా కనిపిస్తుంది. అయితే లోపలికి వెళ్లిన తర్వాత దీని ప్రత్యేకత అర్థమవుతుంది. అందుబాటులో ఉన్న అతి తక్కువ స్థలాన్ని తెలివిగా వినియోగిస్తూ.. ఒక వ్యక్తి నివసించేందుకు అవసరమైన సౌకర్యాలను ఇందులో ఏర్పాటు చేశారు. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్, డైనింగ్ స్పేస్ వంటి సదుపాయాలను డిజైన్‌లో భాగం చేశారు.

**వెడల్పు ఎంతో తెలిస్తే ఆశ్చర్యపోతారు!**

కెరెట్ హౌస్‌లో అందరినీ ఆశ్చర్యపరిచే అంశం దాని వెడల్పే. దీని అత్యంత ఇరుకైన భాగం సుమారు 72 సెంటీమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుందని, కొంత వెడల్పైన ప్రాంతంలో సుమారు 122 సెంటీమీటర్ల వరకు ఉంటుందని వివరాలు చెబుతున్నాయి. కొన్ని వనరుల్లో నిర్మాణంలోని భిన్న భాగాలను బట్టి కొలతలు మారుతూ పేర్కొనబడ్డాయి. ఇంత తక్కువ స్థలంలోనే ఇంటికి అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడం ఆర్కిటెక్ట్ సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచింది. స్థలం వృథా కాకుండా ప్రతి అంగుళాన్ని ఉపయోగించుకునేలా ఇంటి అంతర్గత డిజైన్‌ను రూపొందించారు.

**మెట్లు కూడా చాలా ప్రత్యేకమే!**

సాధారణ ఇళ్లలో ఉండేలా విశాలమైన మెట్లను ఏర్పాటు చేసే అవకాశం ఇక్కడ లేదు. అందుకే స్థలాన్ని ఆదా చేసే విధంగా మెటల్ మెట్లు, నిచ్చెన తరహా మార్గాలను ఉపయోగించారు. ఇంటి చిన్న పరిమాణానికి అనుగుణంగా ఫర్నిచర్, నిల్వ ప్రదేశాలు కూడా ప్రత్యేకంగా డిజైన్ చేశారు.

**ఇల్లు మాత్రమే కాదు.. ఒక కళాఖండం!**

కెరెట్ హౌస్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. సాధారణ నిర్మాణ నిబంధనల ప్రకారం దీనిని పూర్తి స్థాయి నివాస భవనంగా పరిగణించలేని కారణంగా దీనిని ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ లేదా కళాఖండంగా గుర్తించారు. అదే సమయంలో ఈ నిర్మాణం ఆర్కిటెక్చర్ రంగంలో వినూత్న ప్రయోగంగా ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని సంపాదించింది.

**చరిత్రతోనూ ముడిపడి ఉన్న కెరెట్ హౌస్**

ఈ ఇంటి పేరు కూడా ప్రత్యేకమైనదే. ఇజ్రాయెల్ రచయిత, చిత్రనిర్మాత ఎట్గర్ కెరెట్ పేరుతో దీనికి పేరు పెట్టారు. కెరెట్ కుటుంబ చరిత్ర హోలోకాస్ట్‌తో ముడిపడి ఉంది. ఈ నిర్మాణం ఉన్న ప్రాంతం కూడా ఒకప్పుడు వార్సా ఘెట్టో పరిధికి సమీపంలో

ఉండేది. అందువల్ల కెరెట్ హౌస్ కేవలం వాస్తుశిల్ప ప్రయోగంగా కాకుండా చారిత్రక జ్ఞాపకాలకు ప్రతీకగా కూడా నిలిచింది. ప్రస్తుతం ఈ ఇల్లు రచయితలు, కళాకారులు, సృజనాత్మక రంగాలకు చెందిన వ్యక్తులకు తాత్కాలికంగా ఉపయోగపడే స్థలంగా కొనసాగుతోంది. సృజనాత్మక ఆలోచనలకు అనువైన ప్రత్యేక ప్రదేశంగా కూడా దీనికి గుర్తింపు ఉంది. మొత్తానికి స్థలం ఎంత చిన్నదైనా ఆలోచన పెద్దదైతే అద్భుతమైన నిర్మాణం సాధ్యమే అని కెరెట్ హౌస్ నిరూపిస్తోంది. అందుకే ఇది ప్రపంచంలోనే అత్యంత సన్నని ఇళ్లలో ఒకటిగా మాత్రమే కాకుండా.. వాస్తుశిల్పం, కళ, చరిత్ర కలిసిన అసాధారణ నిర్మాణంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

## టెక్సాస్‌లో ఇండియన్ రెస్టారెంట్ మూసివేత.. అసలు కారణం ఇదేనా?




అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం తెలుగు ప్రజలకు మరో ప్రత్యేకమైన ప్రాంతంగా మారిపోయింది. ముఖ్యంగా డల్లాస్, ఫ్రిస్కో తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో తెలుగు కుటుంబాలు స్థిరపడ్డాయి. అందుకే డల్లాస్‌ను సరదాగా 'డల్లాస్‌పురం' అని కూడా పిలుస్తుంటారు. తెలుగు జనాభా పెరగడంతో గత కొన్నేళ్లుగా అక్కడ భారతీయ, ముఖ్యంగా తెలుగు రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపారాలు భారీగా పెరిగాయి.

ఈ నేపథ్యంలో టెక్సాస్‌లోని ఫ్రిస్కోలో ఓ భారతీయ రెస్టారెంట్‌పై అధికారులు తీసుకున్న చర్య ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఆరోగ్య శాఖ తనిఖీల్లో పలు తీవ్రమైన ఆహార భద్రతా ఉల్లంఘనలు గుర్తించడంతో ఆ రెస్టారెంట్‌ను తాత్కాలికంగా మూసివేసినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**రెస్టారెంట్‌లో ఏం గుర్తించారు?**

ఆరోగ్య శాఖ తనిఖీల సందర్భంగా రెస్టారెంట్‌లో ఎలుకల విసర్జన కనిపించినట్లు సమాచారం. అంతేకాకుండా ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయకపోవడం, పరిశుభ్రత లోపించడం, కొన్ని ఆహార పదార్థాలపై బూజు కనిపించడం వంటి అంశాలను అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆహార తయారీ, నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉండటంతో అధికారులు కఠిన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇలాంటి ఉల్లంఘనలు రెస్టారెంట్లలో ఫుడ్‌బోర్న్ ఇన్ఫెక్షన్లు, ఆహార కలుషితం వంటి సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది.

**తెలుగు కమ్యూనిటీలో చర్చ**

ఫ్రిస్కోలోని భారతీయ, ముఖ్యంగా తెలుగు కమ్యూనిటీలో ఈ ఘటనపై చర్చ జరుగుతోంది. అయితే మూసివేసిన రెస్టారెంట్ పేరు, అధికారులు గుర్తించిన ఉల్లంఘనలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా స్పష్టంగా బయటకు రాలేదు. అందువల్ల సోషల్ మీడియాలో వస్తున్న పేర్లు లేదా ఇతర ప్రచారాలను అధికారిక ధృవీకరణ లేకుండా నమ్మకపోవడం మంచిది.గత కొన్నేళ్లుగా టెక్సాస్‌లో భారతీయ జనాభా పెరగడంతో అనేక కొత్త రెస్టారెంట్లు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో స్థానికుల నుంచి భారతీయ వ్యాపారాల పెరుగుదలపై అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ప్రత్యేక ఘటనను మొత్తం భారతీయ లేదా తెలుగు వ్యాపార సమాజానికి ఆపాదించడం సరికాదు.ఆహార నాణ్యత, పరిశుభ్రత, ప్రజారోగ్య నిబంధనలు పాటించడం ప్రతి రెస్టారెంట్‌కు తప్పనిసరి. ఫ్రిస్కోలో జరిగిన ఈ ఘటన కూడా ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూపించే ఉదాహరణగా నిలుస్తోంది. రెస్టారెంట్‌పై తదుపరి చర్యలు, తిరిగి తెరవడానికి అధికారులు విధించే నిబంధనలు వంటి వివరాలు అధికారికంగా వెల్లడైతే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ట్రోఫీ పట్టుకుని మళ్ళీ 'నఖ్వీ' పరుగు పందెం? మహిళల ఆసియా కప్ ఫైనల్‌పై నెటిజన్ల కన్ను



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడూ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) బాస్ అయిన మోసిన్ నఖ్వీ డ్రామా సిరీస్ రెండో సీజన్‌కు సిద్ధమవుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో ఊహాగానాలు షురూ అయ్యాయి. మహిళల ఆసియా కప్ ఫైనల్ పోరు ముగిశాక.. ట్రోఫీ ప్రజెంటేషన్‌కు మన నఖ్వీ గారే చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నారట.. ఈ వార్త వినగానే క్రికెట్ అభిమానులకు గతేడాది సీన్లన్నీ కళ్ళముందు రీల్ లాగా తిరుగుతున్నాయి.కిందటేడు పురుషుల ఆసియా కప్ ముగిశాక జరిగింది గుర్తుండే ఉంటుంది. టీమ్ ఇండియా టైటిల్ కొట్టింది కానీ పీసీబీ చైర్మన్ చేతుల మీదుగా కప్పు అందుకోవడానికి ససేమిరా అంది. బోర్డర్‌లో ఉద్రిక్తతలు ఉన్నప్పుడు ఆట ఆటలాగే ఉంటుంది.. కానీ ఆ ట్రోఫీ అందుకోవడం మా వల్ల కాదు అని కుండబద్దలు కొట్టింది. అయితే అక్కడ అసలైన ట్విస్ట్ ఇచ్చారు నఖ్వీ గారు.. భారత్ ట్రోఫీని తీసుకోకపోతే ఏకంగా ఆ కప్పును తానొక్కడే ఇంటికి మోసుకెళ్లిపోయారు. అసలు అది ఏసీసీ ట్రోఫీనా లేక ఆయన వ్యక్తిగత ప్రాపర్టీయా అన్నట్లు ఆ ట్రోఫీని వెంటబెట్టుకుని వెళ్లిపోవడం అప్పట్లో నవ్వుల పాలైంది.

ఇప్పుడు మళ్ళీ కథ మొదలైంది. సెప్టెంబర్ 13న జరగబోయే మహిళల ఆసియా కప్ ఫైనల్‌లో భారత మహిళల జట్టు టైటిల్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సెమీస్‌కు దూసుకెళ్లిన మన అమ్మాయిలు ఫైనల్ చేరి కప్పు కొడితే.. మళ్ళీ ప్రెజెంటేషన్ వేదికపై అదే సీన్ రిపీట్ అవుతుందా? అని క్రికెట్ ప్రియులు సెటైర్లు వేస్తున్నారు. ఒకవేళ భారత మహిళల జట్టు టైటిల్ గెలిచి.. నఖ్వీ గారి చేతుల మీదుగా కప్పు తీసుకోకపోతే.. ఈసారి ఆ ట్రోఫీని ఆయన ఏం చేస్తారు? పాత అలవాటు ప్రకారం మళ్ళీ విమానం ఎక్కించి లాహోర్ తీసుకెళ్తారా? లేక ఈసారి దుబాయ్‌లోని ఏసీసీ ఆఫీస్‌లో కప్‌కు సెక్యూరిటీ గార్డ్‌లా పహారా కాస్తారా?

"భారత జట్టు గెలిస్తే ట్రోఫీ ఇచ్చేది లేదు.. దాచుకోవడమే మన పని" అన్నట్లు నఖ్వీ వ్యవహరిస్తున్న తీరును చూసి సోషల్ మీడియాలో మీమ్స్ వర్షం కురుస్తోంది. ఆసియా క్రికెట్‌ను నడిపించాల్సిన పెద్ద మనిషి.. ఇలా కప్పు పట్టుకుని డ్రామాలు ఆడటం ఒక్క నఖ్వీకే చెల్లిందని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు.

నఖ్వీ గారు కనుక నిజంగానే ఫైనల్‌కు విచ్చేస్తే.. మ్యాచ్ కంటే కూడా ప్రజెంటేషన్ వేడుకలోనే అసలైన 'కామెడీ అండ్ హై డ్రామా' ఖాయమని స్పష్టమవుతోంది. ఈసారైనా ట్రోఫీ వేదికపైనే ఉంటుందా లేక మళ్ళీ నఖ్వీగారితో పాటు మాయమవుతుందో చూడాలి!

ప్రకృతి నిశ్శబ్దంగా ఉన్నప్పుడు మనిషి తన శక్తిని అపరిమితమని భావిస్తాడు.. కానీ ఒక్కసారి భూమి అంతర్భాగం కదిలితే నాగరికత నిర్మించుకున్న ఆత్మవిశ్వాసం ఎంత బలహీనమో అర్థమవుతుంది. ఇండోనేషియాలోని సుండా జలసంధిలో తాజాగా అనక్ క్రాకటోవా మళ్లీ బద్దలవడం.. శతాబ్దం క్రితం జరిగిన మహా విపత్తు జ్ఞాపకాలను ప్రపంచం ముందుకు తీసుకొచ్చింది. సెప్టెంబర్ 4న రాత్రి 11.07 గంటలకు ప్రారంభమైన నిరంతర విస్ఫోటన దశ సుమారు 25 గంటలపాటు కొనసాగి సెప్టెంబర్ 6న ముగిసింది. తర్వాత కూడా చిన్నపాటి విస్ఫోటనాలు, బూడిద ఉద్గారాలు కొనసాగుతున్నాయి. అగ్నిపర్వతం ప్రస్తుతం లెవల్-3 హెచ్చరిక స్థాయిలోనే ఉంది. బూడిద మేఘాలు సుమారు 50 వేల అడుగుల ఎత్తుకు చేరడంతో జకార్తా సహా పలు ప్రాంతాల విమానాశ్రయాలను మూసివేయాల్సి వచ్చింది. 2,300కు పైగా విమానాల రాకపోకలు ప్రభావితమై.. 2.7 లక్షలకు పైగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇది కేవలం ఒక అగ్నిపర్వతం నుంచి వెలువడిన పొగ కాదు.. ప్రకృతి శక్తి ఎంత విస్తృతంగా మానవ వ్యవస్థలను ప్రభావితం చేయగలదో చూపిస్తున్న ప్రత్యక్ష ఉదాహరణ. విమానయానం ఆగిపోవడం నుంచి పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులకు మారడం వరకు.. బూడిద మేఘాలు రోజువారీ జీవితాన్ని తలకిందులు చేస్తున్నాయి. తాజా పరిస్థితుల్లో పెద్ద సునామీ ముప్పు లేదని అధికారులు చెబుతున్నప్పటికీ.. 2018లో ఇదే అనక్ క్రాకటోవా కార్యకలాపాల కారణంగా సంభవించిన ఘోర సునామీ జ్ఞాపకం మాత్రం తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

క్రాకటోవా పేరు ప్రపంచానికి కొత్త కాదు.. 1883లో ఇదే ప్రాంతంలో జరిగిన మహా విస్ఫోటనం భూమి చరిత్రలోనే అత్యంత విధ్వంసకర అగ్నిపర్వత ఘటనల్లో ఒకటిగా నిలిచింది. అప్పుడు అగ్నిపర్వత నిర్మాణం భారీగా కూలిపోవడంతో సముద్రంలో విపరీతమైన అలలు పుట్టాయి. 36 వేలమందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. వారిలో అత్యధికులు అగ్నిపర్వత లావాకు కాకుండా సునామీకి బలయ్యారు. ఆ విస్ఫోటనం ప్రభావం సముద్రం, వాతావరణం మీద కూడా పడింది. ఆకాశంలోకి చేరిన బూడిద, వాయువులు ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేశాయి. ఆ మహావిస్ఫోటనం తర్వాత అదే ప్రాంతంలో పుట్టుకొచ్చిన కొత్త అగ్నిపర్వతానికే 'అనక్ క్రాకటోవా'.. అంటే 'క్రాకటోవా బిడ్డ' అని పేరు. 1927 నుంచి ఈ అగ్నిపర్వతం తరచూ కార్యకలాపాలను ప్రదర్శిస్తూనే ఉంది. 2018లో అనక్ క్రాకటోవా ఒక భాగం సముద్రంలోకి కూలిపోవడంతో సునామీ ఏర్పడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అందుకే ఇప్పుడు జరుగుతున్న విస్ఫోటనాన్ని కేవలం 'మరో అగ్నిపర్వత బ్లాస్ట్'గా చూడటం సరికాదు. అగ్నిపర్వతం సముద్ర మధ్యలో ఉండటం.. దాని చుట్టూ జావా, సుమత్రా వంటి జనసాంద్రత కలిగిన ద్వీపాలు ఉండటం.. సముద్ర రవాణా, విమాన మార్గాలు సమీపంలో ఉండటం.. ప్రమాదాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. అయితే గతంతో పోలిస్తే మానవాళి వద్ద ఇప్పుడు ఒక కీలకమైన ఆయుధముంది. శాస్త్రీయ పర్యవేక్షణ. భూకంప సంకేతాలు, అగ్నిపర్వత ఆకృతి మార్పులు, బూడిద మేఘాల కదలిక, ఉపగ్రహ చిత్రాలు, సముద్ర మట్టంవంటి అంశాలను నిరంతరం గమనించే

## మళ్లీ బద్దలైన క్రాకటోవా..

వ్యవస్థలున్నాయి. తాజా పరిస్థితుల్లో కూడా ఇండోనేషియా అధికారులు అగ్నిపర్వతాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. అగ్నిపర్వతం చుట్టూ మూడు కిలోమీటర్ల పరిధిలోకి ప్రజలు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

అయితే క్రాకటోవా తాజా ప్రకోపం అసలు ప్రశ్నను మరోసారి మన ముందుంచుతోంది. ప్రకృతి విపత్తును మనం ఎంతవరకు అంచనా వేయగలుగుతున్నాం? ఎంతవరకు సిద్ధంగా ఉన్నాం? అగ్నిపర్వతం పేలడాన్ని ఆపడం మానవుల చేతుల్లో లేదు. కానీ దాని ప్రభావాన్ని తగ్గించడం మాత్రం సాధ్యమే. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సురక్షిత తరలింపు మార్గాలు, తీర ప్రాంతాల్లో అత్యవసర సమాచార వ్యవస్థలు, ప్రజలకు నిరంతర అవగాహన.. ఇవే ప్రాణాలను కాపాడే నిజమైన రక్షణ కవచాలు. ముఖ్యంగా అగ్నిపర్వత ప్రమాదాన్ని కేవలం లావా ప్రవాహంతోనే ముడిపెట్టకూడదు. బూడిద వల్ల గాలి నాణ్యత దెబ్బతినవచ్చు.. విమాన ఇంజిన్లు ప్రమాదంలో పడవచ్చు.. పంటలు, నీటి వనరులు ప్రభావితమవుతాయి. సముద్రంలో మార్పులు సునామీ ప్రమాదాన్ని సృష్టించవచ్చు. తాజా విస్ఫోటనం కారణంగా విమానయాన వ్యవస్థకు ఏర్పడిన అంతరాయం..

ప్రకృతి విపత్తుల ప్రభావం ఇప్పుడు స్థానికంగా కాకుండా అంతర్జాతీయంగా ఎలా మారుతుందో చూపిస్తోంది. ఒక అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద వేల కిలోమీటర్ల దూరంలోని విమాన మార్గాలను ప్రభావితం చేయగలదు. ప్రపంచం పరస్పరం అనుసంధానమైపోయిన కొద్దీ.. ఒక ప్రాంతపు ప్రకృతి విపత్తు మరో ప్రాంతపు ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుంది. అందుకే క్రాకటోవా కథ భూగర్భ శాస్త్రానికి మాత్రమే పరిమితమైనది కాదు.. వాతావరణం, రవాణా, ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విపత్తు నిర్వహణ అన్నింటికీ సంబంధించిన పాఠం. ప్రకృతిని జయించగలమనే అహంకారం కన్నా.. ప్రకృతిని అర్థం చేసుకుని దాని సంకేతాలను గౌరవించడమే మానవాళికి సరైన మార్గం. 1883లో క్రాకటోవా గర్జన వేలాది ప్రాణాలను బలిగొంది. 2018లో అనక్ క్రాకటోవా మరోసారి సముద్రాన్ని ఉప్పొంగించింది. ఇప్పుడు 2026లో అదే అగ్నిపర్వతం మళ్లీ తన ఉనికిని చాటుతోంది. ఇది భయపడాల్సిన సమయం కాదు, మరింత అప్రమత్తం కావాల్సిన సమయం. ప్రకృతి ఎప్పుడు, ఎలా స్పందిస్తుందో మనిషి నిర్ణయించలేడు. కానీ అది స్పందించినప్పుడు ఎంత నష్టాన్ని తగ్గించాలన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంది. క్రాకటోవా నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సిన అసలు పాఠం ఇదే.. విపత్తును ఆపలేకపోయినా.. విపత్తు విషాదంగా మారకుండా అడ్డుకోవచ్చు. క్రాకటోవా గర్జన మనిషి సాధించిన అభివృద్ధికి సవాలు కాదు.. ప్రకృతి శక్తి ముందు అప్రమత్తత ఎంత అవసరమో చెప్పే హెచ్చరిక. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో శాస్త్ర సాంకేతికతతో పాటు.. ప్రభుత్వాల ముందుచూపు, ప్రజల అవగాహన కూడా అంతే కీలకం. ఒక విస్ఫోటనం ఎక్కడ మొదలైనా.. దాని ప్రకంపనలు ప్రపంచంలోని మరో మూలకు చేరే కాలంలో మన రక్షణ వ్యవస్థలు కూడా అంతే వేగంగా స్పందించాలి. ప్రకృతితో పోరాడటం కాదు.. దాని సంకేతాలను ముందుగానే చదివి, నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తీసుకురావడమే ఆధునిక మానవ సమాజం ముందున్న అసలు లక్ష్యం. క్రాకటోవా మళ్లీ గర్జించింది.. ఆ గర్జనలో వినిపిస్తున్న హెచ్చరికను ఈసారి ప్రపంచం ముందుగానే ఆలకించాలి!!

## పనికొచ్చే పలుకు



## ఓటమి అంచుల్లోనే విజయం ఉంటుంది!

కామిక్ ప్రపంచంలో ఎంతోమంది సూపర్ హీరోలు. అయినా, స్పైడర్‌మ్యాన్ పాత్రకున్న ఆదరణే వేరు. అతను అసాధారణ శక్తులున్న హీరో మాత్రమే కాదు.. మనలాగే రోజువారీ సమస్యలతో సతమతమయ్యే సగటు మనిషి కూడా. అందుకే స్పైడర్‌మ్యాన్ పలికే ప్రతి మాటా పాఠకుల గుండెల్లో గాఢంగా నాటుకుపోతుంది. ప్రతికూల పరిస్థితులు చుట్టుముట్టినప్పుడు, దారి కానరానప్పుడు ఆయన చూపించే ఆత్మవిశ్వాసం అందరికీ ఒక దిశానిర్దేశం చేస్తుంది.

1966లో వెలువడిన 'ది అమేజింగ్ స్పైడర్‌మ్యాన్-33' కామిక్ పత్రిక 'ఇఫ్ దిస్ బి మై డెస్టినీ...!' అనే కథాంశానికి ముగింపు భాగం. ఇందులో పీటర్ పార్కర్ అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో చిక్కుకుపోతాడు. భారీ యంత్రాల రాశి కింద నలిగిపోతూ, చుట్టూ నీరు చేరుతున్న వేళ, తీవ్రగాయాలతో, శక్తులన్నీ క్షీణించి కనిపిస్తాడు. అక్కడ నుంచి బయటపడటం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది. అయినా సరే, లొంగిపోవడం స్పైడర్‌మ్యాన్ నిఘంటువులోనే లేదు. తన వద్దవున్న ప్రాణరక్షక సీరం మేనత్త 'మే' ప్రాణాలను కాపాడాలి. తనపై ఉన్న ఆ కొండంత బరువే.. ఆయనలోని బాధ్యతను, భయాలను పునరుజ్జీవింపజేస్తుంది. ఆ భయంకరమైన ఘడియల్లో పీటర్ తనలో తాను చెప్పుకున్న మాటలు ఇప్పటికీ మార్మోగుతుంటాయి.

"పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు పోరాడి గెలవడం ఎవరైనా చేస్తారు. కానీ పరిస్థితులు అత్యంత దారుణంగా మారి, గెలిచే అవకాశమే లేదనుకున్నప్పుడు నిలబడటమే అసలైన పోరాటం" అని పీటర్ పార్కర్ ఆక్రోశించాడు.

ధైర్యం అంటే గెలుపునకు గ్యారెంటీ కాదు

ఈ మాటలకున్న ఆంతర్యం పట్టుదల. పరిస్థితులు బాగున్నప్పుడు విజయాన్ని వేడుక చేసుకోవడం సులభం. విఫలమవుతామని తెలిసినా, అనిశ్చితి వెంటాడుతున్నా ముందుకు సాగడమే మనిషిలోని నిజమైన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుంది. ధైర్యం అంటే గెలుపు దక్కుతుందని గ్యారెంటీ ఇవ్వడం కాదు, ఫలితమెలావున్నా ప్రయత్నాన్ని ఆపకపోవడమేనని ఈ సన్నివేశం చాటిచెబుతోంది.

పీటర్ పార్కర్ జీవితం ఇచ్చే పాఠం


స్పైడర్‌మ్యాన్‌గా మారినంత మాత్రాన పీటర్ జీవితం తేలికైపోలేదు. అపారమైన శక్తులు రావడంవల్ల ఆయనపై బాధ్యతలు మరింత పెరిగాయి. చదువు, ఉద్యోగం, కుటుంబం, స్నేహాలను కాపాడుకుంటూనే.. న్యూయార్క్ నగరాన్ని రక్షించాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఆయన ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేశాడు, విమర్శలు ఎదుర్కొన్నాడు. శక్తులున్నంత మాత్రాన విజయం దక్కదు. క్లిష్ట సమయాల్లో వెనక్కి తగ్గకపోవడమే వీరత్వానికి నిజమైన నిర్వచనం. ప్రారంభంలో తన శక్తులను స్వార్థం కోసం వాడుకున్న ఒక కుర్రాడు, కాలక్రమేణా ఇతరుల కోసం జీవించే గొప్ప హీరోగా ఎలా మారాడో మార్వెల్ కామిక్స్ అద్భుతంగా ఆవిష్కరించింది.

నేటి జీవితానికి ఎలా వర్తిస్తుంది?

ఈ ఐకానిక్ డైలాగ్ కేవలం కామిక్ పుస్తకాలకే పరిమితం కాదు. ఇందులో చెప్పిన "పోరాటం" కేవలం విలన్లతో చేసే యుద్ధం మాత్రమే కాదు. విద్యార్థులకు ఎదురయ్యే వైఫల్యాలు, కెరీర్‌లో వచ్చే ఆటంకాలు, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే నష్టాలు.. వీటన్నింటికీ ఇది చక్కగా వర్తిస్తుంది. ఓటమి ముంగిట ఉన్నా సరే, అడుగు ముందుకు వేయడమే నిజమైన ధైర్యమని స్పైడర్‌మ్యాన్ మనకు నేర్పిన పాఠం.

# నీటితో కొత్త అభివృద్ధి చరిత్ర!

### ప్రాజెక్టులు పూర్తయితే సరిపోదు.. చివరి పొలానికీ నీరు చేరాలి





కరవు నేలపై పడే తొలి నీటిబొట్టు.. కేవలం మట్టిని తడపదు, ఒక కుటుంబం భవిష్యత్తును తడుపుతుంది. కాలువలో పరుగెత్తే జలధార.. పొలాన్ని పచ్చగా మార్చడమే కాదు, రైతు ఆదాయానికి కొత్తదారులు తెరుస్తుంది; గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుంది. పోలవరం నుంచి వెలిగొండ వరకు.. చెరువునుంచి చివరి ఆయకట్టు వరకు సాగుతున్న జల ప్రయాణం అందుకే నిర్మాణాల కథ కాదు.. నవ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునర్నిర్మాణానికి పునాది. నీరు ఎక్కడికి చేరితే అక్కడ పంట పుడుతుంది.. పంటతో పాటు పరిశ్రమ పుట్టిస్తుంది. ఉపాధి పురివిప్పుతుంది. మార్కెట్ విస్తరిస్తుంది.. మొత్తం గ్రామం కొత్త రూపం సంతరించుకుంటుంది.

నీరు ఒక వనరు మాత్రమే కాదు.. అది ఆర్థిక వ్యవస్థకు ఇంధనం. ఒక పొలానికి నీరు చేరినప్పుడు అక్కడ కేవలం ఒక పంట పండదు. రైతు ఆదాయానికి కొత్త అవకాశం పుడుతుంది. పంటల వైవిధ్యానికి తలుపులు తెరుచుకుంటాయి. పంటలతో పాటు పాడి, మత్స్య, ఉద్యాన, ఆహార ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ప్యాకేజింగ్ వంటి అనేక రంగాలు చైతన్యవంతమవుతాయి. ఒక చిన్న గ్రామానికి వచ్చిన నీరు.. క్రమంగా ఒక పెద్ద ఆర్థిక గొలుసును కదిలించే శక్తిగా మారుతుంది. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టులపై జరుగుతున్న ప్రయత్నాలను కేవలం ఇరిగేషన్ శాఖకు సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలుగా చూడటం సరిపోదు. అవి రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణంలో కీలకమైన పెట్టుబడులు. 2026 ఇరిగేషన్ క్యాలెండర్‌లో 36 ప్రాధాన్య ప్రాజెక్టులకు సుమారు రూ.35,555 కోట్ల అంచనాతో లక్ష్యాలు పెట్టడం ఈ దిశలో ఒక పెద్ద అడుగు. అదే సమయంలో జలధార-- జలహారతి వంటి కార్యక్రమాల ద్వారా చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, భూగర్భ జలాల రీచార్జ్ వంటి పనులను ముందుకు తీసుకెళ్లడం కూడా అవసరమైన సమాంతర చర్య. ఎందుకంటే భారీ ప్రాజెక్టులు నదీ జలాలను ప్రాంతాలకు తీసుకువస్తే.. స్థానిక జల సంరక్షణ వ్యవస్థలు ఆ నీటిని నిలబెట్టి భవిష్యత్తుకు భద్రపరుస్తాయి. పెద్ద ప్రాజెక్టు నుంచి చిన్న చెరువు వరకు.. కాలువ నుంచి రైతు పొలం వరకు.. నీటి వ్యవస్థ మొత్తం ఒక గొలుసుగా పనిచేసినప్పుడే పెట్టుబడికి పూర్తి ఫలితం వస్తుంది.

ఇక్కడి నుంచి ప్రభుత్వానికి, ముఖ్యంగా చంద్రబాబు ముందుంచుకున్న జల ప్రాధాన్యానికి అసలు పరీక్ష మొదలవుతుంది. ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం ఒక రాజకీయ హామీ. నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడం పరిపాలనా బాధ్యత. ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని విడుదల చేయడం ఒక విజయ సూచిక. కానీ ఆ నీరు చివరి ఆయకట్టుకు చేరడం మాత్రమే పూర్తి విజయం. అందుకే ఇకపై ఇరిగేషన్ పనుల కొలమానం మారాలి. 'ఎన్ని కిలోమీటర్ల కాలువ నిర్మించాం?' అనే ప్రశ్నతో పాటు 'ఎన్ని ఎకరాలకు నీరు చేరింది?' అనాలి. 'ఎంత నిధి ఖర్చు చేశాం?'తో పాటు 'రైతు ఆదాయం ఎంత పెరిగింది?' అని అడగాలి. 'ప్రాజెక్టు పూర్తయింది' అనే ప్రకటనతో పాటు 'నీటి వినియోగ సామర్థ్యం ఎంత పెరిగింది?' అనే లెక్క కూడా బయటకు రావాలి. పోలవరం వంటి భారీ ప్రాజెక్టు విషయంలోనూ, వెలిగొండ వంటి కరవు ప్రాంతాల ఆశలతో ముడిపడిన ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే ప్రమాణం వర్తిస్తుంది. రాజకీయంగా క్రెడిట్ కోసం జరిగే పోటీ ఎప్పుడూ ఉంటుంది. ఎవరు శంకుస్థాపన చేశారు, ఎవరి హయాంలో ఎంత పని జరిగింది, ఎవరి ప్రభుత్వం దాన్ని పూర్తి చేసింది అనే వాదనలు కూడా కొనసాగుతాయి. కానీ రైతు మాత్రం ఆ వాదనలను వినడు. అతనికి కావాల్సింది కాలువలో నీరు. పంటకు నీరు. పంటకు సరైన ధర. ఆదాయానికి భద్రత. అందుకే నీటి రాజకీయాన్ని నీటి ఫలితాల రాజకీయంగా మార్చాల్సిన సమయం ఇది. ఒక ప్రాజెక్టు మీద ప్రభుత్వానికి క్రెడిట్ రావాలంటే.. ఆ ప్రాజెక్టు వల్ల ప్రజలకు వచ్చిన ప్రయోజనం కనిపించాలి. అదే శాశ్వతమైన రాజకీయ మూలధనం.

ఈ నేపథ్యంలో చంద్రబాబు కొత్త జల దృష్టికి మరో విస్తృత కోణం కూడా ఉంది. నీటిని వ్యవసాయంతో మాత్రమే కాకుండా.. రాష్ట్ర పారిశ్రామిక, గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయాలి. సాగునీరు ఉన్న ప్రాంతాల్లో అధిక విలువైన పంటలు, ఉద్యానవనాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు అభివృద్ధి చెందాలి. నీటి లభ్యతతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పెట్టుబడులు రావాలి. రైతు ఉత్పత్తికి మార్కెట్ దొరకాలి. యువతకు స్థానికంగా ఉపాధి లభించాలి. అప్పుడు మాత్రమే నీటి ప్రాజెక్టు ఒక 'ఇరిగేషన్ ప్రాజెక్టు' నుంచి 'డెవలప్‌మెంట్ ప్రాజెక్టు'గా మారుతుంది. కరవు ప్రాంతానికి నీరు తీసుకెళ్లడం ద్వారా అక్కడి భౌగోళిక పరిస్థితినే మార్చగలిగితే.. అది ఒక ప్రభుత్వ హయాంలో పూర్తయిన పని కాదు, తరతరాలకు మిగిలే ఆస్తి. ఈ దశలో చంద్రబాబు ముందున్న లక్ష్యం కూడా అదే కావాలి. గతంలో సాంకేతికతతో కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న ఆలోచనకు ఎలా ప్రాధాన్యం ఇచ్చారో.. ఇప్పుడు నీటితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం ఇవ్వాలి. పోలవరం, వెలిగొండ, ఇతర ప్రాజెక్టులు ఒక పెద్ద జల నెట్‌వర్క్‌కు పునాదులు కావాలి. ఆ నెట్‌వర్క్ రైతు పొలాన్ని మార్కెట్‌తో, గ్రామాన్ని పరిశ్రమతో, నీటిని ఆదాయంతో అనుసంధానం చేయాలి. అప్పుడు మాత్రమే 'వాటర్‌మ్యాన్' అనే పదం ఒక రాజకీయ బిరుదుగా కాకుండా.. ఒక అభివృద్ధి నమూనాకు ప్రతీకగా నిలుస్తుంది. చివరికి చంద్రబాబు ఈ ఇన్నింగ్స్ నుంచి వదిలి వెళ్లాలనుకునే వారసత్వం ఏదైనా ఉంటే.. అది ఎన్ని ప్రాజెక్టులు కట్టామన్న జాబితా కాకుండా, ఎన్ని కరవు నేలలను పచ్చగా మార్చామన్న చరిత్ర కావాలి. ఎన్ని కాలువలు తవ్వామన్న లెక్క కాకుండా, ఎన్ని రైతు కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందిందన్న లెక్క కావాలి. ఎందుకంటే ఒక నాయకుడి వారసత్వం కాలంతో పాటు నిలవాలంటే.. అది రాతిలో కాదు, ప్రజల జీవితాల్లో కనిపించాలి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ఆ మార్పుకు నీరు మూలధార అయితే.. ఈ ఇన్నింగ్స్‌లో 'వాటర్‌మ్యాన్' అధ్యాయం నిజంగానే చంద్రబాబు రాజకీయ జీవితానికి కొత్త నిర్వచనంగా మారే అవకాశం ఉంది. ■



ఓపిక, క్రమశిక్షణ, నిలకడ.. ఈ మూడు లక్షణాలను దీర్ఘకాలం కలిగి ఉంటేనే గొప్ప కార్యాలను సాధించగలం. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోకుండా.. తాత్కాలిక సంతృప్తి, ఆనందాలకు అలవాటు పడుతున్నట్లయితే మీరు సరైన మార్గంలో ప్రయాణించడం లేదన్నట్లే! వెంటనే ఫలితం రావాలనే ఆత్రుత.. మనలోని సహనాన్ని చంపేస్తుంది. ప్రతిరోజూ చేసే చిన్న ప్రయత్నాలే.. కాలంతో కలిసి పెద్ద విజయాలుగా మారతాయి. ఎదురయ్యే ప్రతి అడ్డంకిని ఓటమిగా కాకుండా.. మనల్ని మరింత బలపరిచే మెట్టుగా చూడాలి. ఎందుకంటే వేగంగా పరుగెత్తినవాడు గమ్యాన్ని చేరడం కాదు.. నిలకడగా ముందుకు సాగినవాడే విజయాన్ని శాశ్వతంగా సొంతం చేసుకుంటాడు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### లైక్స్ కోసం లొకేషన్లకు లాక్!



లైక్స్ కోసం చేసే విన్యాసాలు.. ఇప్పుడు ఇన్‌ఫ్లుయెన్సర్లకే తలనొప్పిగా మారుతున్నాయి! అమెరికాలో ఈ వేసవి పర్యాటక ప్రాంతాల్లో సోషల్ మీడియా క్రియేటర్లకు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది. ప్రసిద్ధ పార్కులు, బీచ్‌లు, క్రీడా వేదికలు, లగ్జరీ రిసార్టుల్లో ఫొటోలు, వీడియోల కోసం హద్దులు దాటుతున్న తీరుపై సాధారణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా సిక్స్ ఫ్లాగ్స్ పార్కులు, నాంటకెట్ వంటి ప్రాంతాల్లో నో ఎంట్రీ, నిషేధాలు, అరెస్టులు ఎదురవుతున్నాయి. తాజాగా హడ్సన్ వ్యాలీలో ఓపెన్ ఏఐ నిర్వహించిన ఇన్‌ఫ్లుయెన్సర్ల సమ్మర్ క్యాంప్ కూడా వివాదంలో చిక్కుకుంది. ఏఐ డేటా సెంటర్లతో పర్యావరణానికి ముప్పు ఉందన్న ఆందోళనల మధ్య ప్రకృతి ఒడిలో క్యాంప్ నిర్వహించడంపై నెటిజన్లు.. 'డేటా సెంటర్‌గా మార్చే ముందు ప్రకృతిని చూపిస్తున్నారా?' అంటూ సెటైర్లు పేల్చారు.

## పిల్లలకు వాయిదా రోగం... పేరెంట్స్ ఇలా ఫాలో అవ్వండి..

# ఇక జన్మలో వాయిదా వేయరు..

కొంతమంది పిల్లలు ఏ పని కూడా సీరియస్ గా తీసుకోరు. టైంలోగా పూర్తి చేయరు. వాళ్లు అలా చేయడానికి కారణం.. మోటివేట్ చేసేవాళ్లు లేకపోవడం, సెల్ఫ్ డిసిప్లిన్, టైం మేనేజ్?మెంట్ స్కిల్స్ లేకపోవడం, బోర్ ఫీలవ్వడం. ఇలా అనేక రకాల కారణాలవల్ల పిల్లలు చేయాల్సిన పనిని వాయిదా?వేస్తుంటారు. అలా వేయకుండా ఉండాలంటే పేరెంట్స్? తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం. చెప్పిన పని ఎందుకు చేయడం లేదు?' అని పిల్లల్ని అడగాలి. దానికి పిల్లలు ఏం చెబుతారో విని, సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాలి. ఆ సమస్యకి సొల్యూషన్ చెప్పాలి. టైంకి పనులు చేయడం ఎంత ముఖ్యమో వివరంగా చెప్పాలి.

ఏ విషయమైనా పిల్లలు పేరెంట్స్? ను చూసి నేర్చుకుంటారు. కాబట్టి తల్లిదండ్రులు టైంకి పనులు చేస్తూ, వాళ్లకి ఇన్స్పిరేషన్ గా ఉండాలి.

మొదట్లో పిల్లలు చేయగలిగే పనులు చెప్పాలి. కష్టమైన పనులు చెబితే, వాళ్లు తమ వల్ల కాదని డీలా పడతారు. ఒక్కోసారి పనిచేసే ప్రయత్నం కూడా చేయరు.

ఇంటిపనుల్లో పిల్లల్ని సాయపడమనడం కొంత వరకు మంచిదే. అలాగని వాళ్లని అదేపనిగా ఒత్తిడి చేయకూడదు.

అలాగే, పిల్లలు ఏ చిన్న పని చేసినా కూడా మెచ్చుకోవాలి. దాంతో, వాళ్లకి ఏ పని అయినా చేయగలమనే కాన్ఫిడెన్స్ వస్తుంది.




పిల్లల పనిలో సహాయం అవసరమైతే, వారికి సహాయం అందించండి.

పిల్లల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండి... వారు ఆ పనిని పూర్తి చేయగలరని నమ్మకం కలిగించండి

పిల్లలు పని చేయడానికి ప్రశాంతమైన ... కాన్సన్? ట్రేషన్? కలిగే వాతావరణం ఉండేలా చూడాలి.

పిల్లలతో మాట్లాడి వారు పనిని వాయిదా వేయడానికి గల కారణాలను తెలుసుకోండి. పిల్లలు పనిని వాయిదా వేస్తున్నట్లయితే, దాన్ని సరిచేయాల్సిందే.. పిల్లలు పనిని వాయిదా వేయడానికి గల కారణాలను అర్థం చేసుకోవడం మరియు దానిని పరిష్కరించడానికి కలిసి పనిచేయడం చాలా ముఖ్యం.. లేకపోతే వారి జీవితంపై వర్క్? వాయిదా ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఇంటి చిట్కాలు : దోమలు, ఈగల గోల భరించలేకపోతున్నారా..

# వంటింటి చిట్కాలతో ఇలా తరిమికొట్టండి..!





దోమలు, ఈగలు చూడటానికి చిన్నవే అయినా వాటివల్ల వచ్చే ఇబ్బందులు మాత్రం అన్నీఇన్నీ కావు. ఎక్కడెక్కడో తిరిగొచ్చి అన్నం, కూరలపై వాలుతుంటాయ్?. ఈగలు.. గుయ్యి గుయ్యి మంటూ చెవిలో మోత మోగిస్తూ చిరాకుపెడుతుంటాయ్?.వానాకాలం ఏ మాత్రం ఏమరపాటుగా వా ఉన్నా డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు చుట్టుముడతాయి. రకరకాల ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయి. వీటి బారి నుంచి తప్పించుకోవాలంటే ఇంట్లోంచి దోమలు, ఈగల్ని వెళ్లగొట్టాలి.రసాయన ఉత్పత్తులకు చెక్? పెట్టి ఈగల్ని, దోమల్ని, ఇతర క్రిమికీటకాల్ని ఇంటి నుంచి పారదోలొచ్చు. అదెలాగంటే..

ఈగలు..

దోమలు.. గోల అంతా ఇంతా కాదు.. దోమకాటు ఒళ్లంతా సూది గుచ్చినట్టు ఉంటుంది. అవి తెచ్చిపెట్టే జబ్బులు, జ్వరాలు. వీటి బారినుంచి బయటపడటానికి ఎన్ని రకాల జెట్ కాయిల్స్, లిక్విడ్స్ వాడితే ఇంకో బాధ. వాటి తయారీలో వాడిన రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.

నిమ్మకాయ చెక్కల్లో లవంగాలు గుచ్చి దోమలు, ఈగలు తిరిగే చోట ఉంచాలిబంతిపూలలోని రెపెల్లెంట్ గుణాలు కూడా దోమలను తరిమేస్తాయి.తులసి, పుదీనా, లావెండర్ మొక్కల్ని పెంచితే ఈగలు ఇంటి దరిదాపుల్లో కనపడవు..తులసి, లవంగం రసాల్ని నీళ్లలో కలిపి ఇంట్లో స్ప్రే చేస్తే దోమలు రావు.ఒక కప్పు నీళ్లలో కొంచెం పుదీనా రసం వేసి స్ప్రే చేసినా... ఫలితం ఉంటుంది.ఈగలు ఎక్కువగా ఉన్నచోట కర్పూరం వెలిగించాలి.

నీళ్లలో ఒక స్పూన్ పసుపు కలిపి ఇల్లు శు భ్రం చేస్తే ఈగలు, దోమలు రావు



# టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా?...

## నిపుణులు ఏం చెబుతున్నారంటే...!

పది మందిలో ప్రత్యేకంగా కనిపించాలనే మనస్తత్వం ఉన్న వాళ్లు టాటూలు వేయించుకుంటారు. అయితే, టాటూలు వేయించుకోవడం సురక్షితమేనా అనే అంశం చాన్నాళ్లుగా చర్చనీయాంశంగా ఉంది. టాటూలు వేసేందుకు ఉపయోగించే సూదులు అపరిశుభ్రంగా ఉండడం, ఒకరికి వాడిన సూదులు మరొకరికి వాడడం వంటి కారణాలతో హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి వైరస్ లు వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో, నిపుణులు ఏం చెబుతున్నారో ఓసారి చూద్దాం.

**టాటూ వేయించుకునే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు**

శరీరంపై టాటూ వేయించుకోవాలనుకునే ప్రదేశంలో వారం ముందు నుంచి మాయిశ్చరైజర్ రాయడం ప్రారంభించాలి.

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తగినంత నీరు త్రాగాలి.

టాటూ వేయించుకునే నాలుగు రోజుల ముందు వరకు ఆ ప్రాంతంలో వాక్సింగ్ లేదా ఎపిలేషన్ చేయకూడదు.

సూర్యరశ్మి నుంచి చర్మాన్ని కాపాడుకోవాలి.

టాటూ వేయించుకునే 24 గంటల ముందు ఆల్కహాల్ లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించకూడదు.

అపాయింట్‌మెంట్‌కు ముందు బాగా తినాలి.

**టాటూ వేసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలు**

టాటూ వేసిన తర్వాత 10 రోజుల వరకు వ్యాయామం మరియు క్రీడలకు దూరంగా ఉండాలి. మూడు వారాల వరకు స్విమ్మింగ్, బీచ్‌లు, బాత్‌టబ్‌లు మరియు జాకుజీలను నివారించాలి. చర్మాన్ని ఎల్లప్పుడూ తేమగా ఉంచుకోవాలి. టాటూ ఆర్టిస్ట్ ఇచ్చిన సూచనలను పాటించాలి.

**టాటూలు సురక్షితమేనా?**

సరైన పద్ధతిలో, తగిన జాగ్రత్తలతో టాటూలు వేయించుకుంటే సురక్షితమే. టాటూ వేసే స్టూడియో పరిశుభ్రంగా ఉండాలి. రంగుల్లో కొన్ని రంగులు అలెర్జీ కారకాలను కలిగి ఉంటాయి. కాబట్టి రంగు టాటూ వేయించుకునే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు టాటూ వేయించుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

**ఏ టాటూలు ఎక్కువగా నొప్పి కలిగిస్తాయి?**

వేళ్ళపై, అరచేతుల్లో, పాదాలపై, మోకాళ్ళపై, మోచేతులపై, వెన్నెముకపై మరియు నడుముపై వేసే టాటూలు ఎక్కువగా నొప్పిని కలిగిస్తాయి. ముంజేతులు మరియు పక్కటెముకలపై వేసే టాటూలు తక్కువ నొప్పిని కలిగిస్తాయి.

**టాటూలు వెలిసిపోకుండా ఎలా నివారించాలి?**

కాలక్రమేణా టాటూ సిరా విచ్ఛిన్నమవుతుంది. టాటూలు వాటి సంతృప్తతను మరియు స్పష్టతను కోల్పోతాయి. సూర్యరశ్మి, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, టాటూ వేసే ప్రదేశం మరియు పరిమాణం వంటి అంశాలు కూడా టాటూ వెలిసిపోవడానికి కారణమవుతాయి. టాటూ వేసిన తర్వాత సన్‌స్క్రీన్ రాసుకోవడం వల్ల రంగు మారకుండా కాపాడుకోవచ్చు. కీళ్ళు మరియు చర్మపు ముడతలు దగ్గర చిన్న టాటూలు వేయించుకోకపోవడం మంచిది.

**ప్రస్తుతం ఏ టాటూలు ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్నాయి?**

యువత సాధారణంగా సన్నని గీతలతో ఉండే పాతకాలపు టాటూలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సైబర్ సిగిల్స్ కూడా ప్రస్తుతం చాలా ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుత ట్రెండ్ ఏమిటంటే టాటూలను ప్రదర్శన కోసం కాకుండా సొంత సంతృప్తి కోసం వేయించుకుంటున్నారు.



# వరద నీటిలో నడుస్తున్నారా?

మురుగుతో కలిసిన వరద నీటిలో నడిస్తే పాదాలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. ముఖ్యంగా చర్మం కింది పొర వాపు (సెల్యులైటిస్) పెద్ద చిక్కే తెచ్చిపెడుతుంది. ఇది ప్రధానంగా స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియాతో వస్తుంది. ఇవి చర్మం గీసుకుపోయిన చోటు నుంచి తేలికగా లోపలికి వెళ్లి, ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఈ సమస్య కాళ్లు, పాదాలు, వేళ్లలో ఎక్కువ. చాలావరకూ చర్మం దిగువ, కొవ్వు పొరలకే పరిమితమవుతుంది. సెల్యులైటిస్‌లో ఇన్‌ఫెక్షన్ తలెత్తిన చోట చర్మం ఎరుపెక్కుతుంది. కాలు వాపు, ఉబ్బు, తీవ్రమైన నొప్పి, బొబ్బల వంటివీ కనిపిస్తాయి. చూడటానికి చర్మం చిన్న గుంతలు పడినట్టుగా నారింజ తొక్కలా కనిపిస్తుంది. కొందరికి జ్వరం, చలి, బలహీనత కూడా తలెత్తొచ్చు. దీనికి యాంటీబయాటిక్ మాత్రలు అంతగా పనిచేయవు. రక్తనాళం ద్వారా 7-10 రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య ముదిరి, ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదమూ ఉంది.

**నివారణ ఉత్తమం**

వర్షపు నీటిలో తడిచినప్పుడు ఇంటికి వచ్చాక వెచ్చటి నీటితో శుభ్రంగా పాదాలు కడుక్కోవాలి. గాట్లు ఉన్నట్టయితే యాంటీబయాటిక్ మలాము రాసుకోవాలి. ఒకవేళ ఒళ్లంతా తడిస్తే వేడి నీటితో స్నానం చేయాలి.

పాదాలు పొడిగా ఉండేలా, గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాకాలంలో బయటకు వెళ్లేటప్పుడు నీటికి తడవని షూ వేసుకుంటే మేలు. పూర్తిగా ఆరిన తర్వాతే చెప్పులు, షూ తిరిగి ధరించాలి. చెప్పులు వేసుకోకుండా ఆరుబయట, **వాననీటిలో నడవొద్దు.**

మధుమేహం వంటి సమస్యలుంటే డాక్టర్ సలహా మేరకు ప్రత్యేక చెప్పులు, షూ వేసుకోవాలి. తరచూ పాదాలు, కాళ్లను గమనించాలి. ఎరుపు, వాపు వంటి లక్షణాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇతరుల పాదరక్షలను వేసుకోవద్దు.

## పాక్ కెప్టెన్‌కు ఐసీసీ ఫైన్.. షఫాలీని ఔట్ చేసి సైగలు చేయడంతో చర్యలు

- షఫాలీ వర్మను ఔట్ చేశాక అతిగా సంబరాలు చేసుకున్న పాక్ కెప్టెన్
- ఫాతిమా సనా ప్రవర్తనపై చర్యలు తీసుకున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి
- మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ కేటాయింపు
- 24 నెలల వ్యవధిలో ఫాతిమాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్
- ఈ మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసీసీ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించింది. టీమిండియా బ్యాటర్ షఫాలీ వర్మ వికెట్ తీసిన అనంతరం అనుచితంగా ప్రవర్తించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, ఆమె ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ షఫాలీ వర్మ (12) ఫాతిమా సనా బౌలింగ్‌లోనే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. వికెట్ తీసిన ఉత్సాహంలో ఫాతిమా, షఫాలీని ఉద్దేశించి పెవిలియన్ వైపు వెళ్లాలంటూ వేలితో సైగ చేస్తూ అనుచితంగా ప్రవర్తించింది. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధనలను ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గత 24 నెలల కాలంలో ఫాతిమా సనాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ క్రీజు వదిలి వెళ్లేందుకు నిరాకరించినందుకు ఆమె ఖాతాలో తొలి డీమెరిట్ పాయింట్ చేరింది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర.. డబుల్ సెంచరీతో అరుదైన జాబితాలోకి!

- ఫైనల్లో 200 చేసిన ఐదో బ్యాటర్
- ఫస్ట్‌క్లాస్‌లో 4,000 పరుగులు పూర్తి
- ఇదే ఫార్మాట్‌లో ఇషాన్‌కు 10వ సెంచరీ
- కుశాగ్ర కూడా ఫైనల్లో సెంచరీ
- ప్రస్తుతం ఆధిపత్యంలో ఈస్ట్ జోన్



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

## స్పిన్ వ్యూహమే మా బలం.. స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకొని బౌలింగ్ చేశా: శ్రీ చరణి



**హైదరాబాద్ పెన్ పవర్:** వుమెన్స్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో (3 వికెట్లు, 7 పరుగులు) చెలరేగిన యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ జట్టు వ్యూహాలను పంచుకున్నారు. మ్యాచ్‌కు ముందే తమ స్పిన్ బౌలర్లు అందరూ (ప్రేమ, తాను, దీప్తి, రాధా యాదవ్ ) కలిసి కూర్చుని వ్యూహరచన చేస్తామని చరణి తెలిపారు. సీనియర్లు చెప్పిన విషయాలను మైదానంలో సమర్థవంతంగా అమలు చేయడంపైనే తాము దృష్టి పెడతామని ఆమె స్పష్టం చేశారు. పిచ్‌ను పరిశీలించిన తర్వాత బంతికి మంచి టర్న్ లభిస్తుందని గ్రహించి, కేవలం స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టానని చెప్పారు. విషయాలను ఎక్కువగా ఆలోచించకుండా సింపుల్‌గా ఉంచుకోవడం, బేసిక్స్‌పైనే ఫోకస్ పెట్టడమే తన సక్సెస్‌కు సీక్రెట్ అని చరణి పేర్కొన్నారు. ఇక అద్భుతంగా రాణించిన తోటి బౌలర్ ప్రేమ రావత్‌ను ప్రశంసిస్తూ.. ఆమె ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ చేయగల సహజ ప్రతిభావంతురాలైన క్రికెటర్ అని కొనియాడారు. బౌలర్లకు సహకరించే ఈ వికెట్‌పై సుమారు 120 పరుగులు సరైన స్కోరేనని అభిప్రాయపడిన ఆమె, ఇకపై టోర్నమెంట్‌లో తాము ఒక్కో మ్యాచ్‌పైనే పూర్తి దృష్టి పెడతామని తేల్చిచెప్పారు.

# తారక్ స్టైల్ ను అసలు మ్యాచ్ చేయగలరా?







యంగ్ టైగర్ ఎన్టీఆర్ అంటే మాస్.. యాక్షన్.. డైలాగ్స్ మాత్రమే కాదు. డ్యాన్స్ కూడా ఆయనలోని అతిపెద్ద ప్లస్ పాయింట్లలో ఒకటి. స్క్రీన్ పై సాంగ్ మొదలైన క్షణం నుంచి ప్రేక్షకుల చూపు తనవైపు తిప్పుకునే స్టైల్ తారక్ సొంతం. అందుకే ఇప్పుడు డ్రాగన్ లో ఆయనతో కలిసి ముగ్గురు హీరోయిన్లు స్టెప్పులేయనున్నారనే రూమర్హాట్ టాపిక్ గా మారింది. అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే.. తారక్ డ్యాన్స్ స్టైల్ ను వాళ్లు మ్యాచ్ చేయగలరా? అని. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్ పై భారీ అంచనాలు న్నాయి. హైవోల్టేజ్ యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న సినిమాలో భారీ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ సెట్ కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పాటలో రుక్మిణీ వసంత్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు తారక్ తో కలిసి కనిపించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే ఆ పాటలో అసలు సవాల్ హీరోయిన్లకు కాదు.. కొరియోగ్రఫీకే. ఎందుకంటే తారక్ డ్యాన్స్ ను నార్మల్ కమర్షియల్ హీరో స్టైల్‌తో పోల్చలేం. ఆయనకు చిన్నప్పటి నుంచే కూచిపూడి శిక్షణ ఉంది. ఆ క్లాసికల్ ప్రాక్టీస్ వల్లే ఆయన స్టెప్స్ లో స్పీడ్ తోపాడు కంట్రోల్, రిథమ్, పోస్చర్ కనిపిస్తాయి. తారక్ డ్యాన్స్ లో మొదట కనిపించేది ఎనర్జీ. కానీ అది కేవలం గట్టిగా కదలడం కాదు. వేగంగా స్టెప్పులు వేసినప్పటికీ బాడీ కంట్రోల్ కోల్పోరు. రెండోది ఫుట్ వర్క్. బీట్ అందుకోవడం మాత్రమే కాకుండా.. తన మూవ్మెంట్స్ తో మరింత హైలైట్ చేయడం ఆయన స్టైల్ లో కనిపిస్తుంది. మూడోది ఎక్స్ప్రెషన్. తారక్ కు డ్యాన్స్ అంటే కేవలం స్టెప్పుల వరుస కాదు. పాటలోని ఫీలింగ్ ను ముఖంలోకి తీసుకురావడం ఆయన స్పెషాలిటీ. అందుకే ఒకే పాటలో ఎనర్జీ, అల్లరి, రౌద్రం, స్టైల్.. ఇలా భిన్నమైన షేడ్స్ ను చూపించగలుగుతారు. దీనికి బెస్ట్ ఎగ్జాంపుల్ ఆర్ఆర్ఆర్ లోని నాటు నాటు సాంగ్. ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి చేసిన ఆ పాటలో కష్టమైన కొరియోగ్రఫీ ఉన్నప్పటికీ ఇద్దరి స్టైల్ ను మ్యాచ్ చేయడానికి ప్రత్యేకంగా ఎన్నో వేరియేషన్స్‌పై పని చేసినట్లు దర్శకుడు రాజమౌళి, కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ వివరించారు. ఇక్కడే డ్రాగన్ స్పెషల్ సాంగ్‌పై ఆసక్తి పెరుగుతోంది. ముగ్గురు హీరోయిన్లు ఉన్నారన్నది ఒక ఎత్తయితే.. వారందరినీ తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా చూపించడం మరో ఎత్తు. పాటలో తారక్ ది ఒక ప్రత్యేకమైన డ్యాన్స్ లాంగ్వేజ్. దానికి తగ్గట్టుగా కొరియోగ్రఫీ ఉంటేనే సాంగ్ మరింత ఎలివేట్ అవుతుంది. ఇక సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మాస్ బీట్ కు తారక్ డ్యాన్స్ తోడైతే.. పాటలో బీట్ కంటే ముందే తారక్ ఫుట్ వర్క్ ప్రేక్షకులను థియేటర్లలో ఊపేయొచ్చు. అందుకే డ్రాగన్ స్పెషల్ సాంగ్ లో అసలు పోటీ ముగ్గురు హీరోయిన్ల మధ్య కాదు. వాళ్లకు, తారక్ డ్యాన్స్ ఎనర్జీకి మధ్యే. తారక్‌తో కలిసి స్టెప్పులేయడం ఒక విషయం.. ఆయన రేంజ్ లో అదే ఎనర్జీని స్క్రీన్ పై నిలబెట్టడం మరో విషయం. మరేం జరుగుతుందో..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965